**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది

సులువుగ తెగిపోదు సున్నిత దారంబు
పెనుగులాటతోడ వీడిపోవు
బంధములును గూడ పగతోడ యట్లుయే
శాంతి, సత్యములన సర్వశుభము

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

RNI - TELTEL/2023/87644

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 18 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 22-05-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


# లిక్కర్‌పై.. జెన్‌జీ అనాసక్తి!



## ఆల్కహాల్‌కు దూరం దూరం

- ఆరోగ్యమే ముఖ్యమంటున్న నేటి తరం
- నాలుగేళ్లలో తగ్గిన రూ.70 వేల కోట్ల అమ్మకాలు
- ప్రీమియం బ్రాండ్స్ లిక్కర్ షేర్లు భారీగా పతనం

న్యూఢిల్లీ,
ఈతరం జెన్ జీ ఆలోచ నలు, అలవాట్లు పూర్తిగా మారుతున్నాయి. ముఖ్యంగా మద్యం తాగే విషయంలో వారు మును పటిలా ఆసక్తి చూపించడం లేదు. ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడం, సరికొత్త లైఫ్‌స్టైల్ ట్రెండ్స్ పాలో అవ్వడం వల్ల ఆల్కహాల్‌కు దూరంగా ఉంటున్నారు. దీని ప్రభావం గ్లోబల్ లిక్కర్ మార్కెట్‌పై తీవ్రంగా పడింది.

-మిగతా 2 లో

# ఎబోలా పై కేంద్రం హై అలర్ట్



- భారత్‌కు వచ్చే విదేశీ ప్రయాణికులకు అడ్వైజరీ జారీ
- ఇండియా, ఆఫ్రికా సదస్సు వాయిదా

న్యూఢిల్లీ
ప్రపంచవ్యాప్తంగా ఎబోలా వైరస్ కలకలం రేపుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎబోలా తీవ్రత ఎక్కువగా ఉన్న ఆఫ్రికా దేశాల నుంచి భారతదేశానికి వచ్చే ప్రయాణికుల కోసం కేంద్ర ఆరోగ్య శాఖ అడ్వైజరీ జారీ చేసింది. ఈ మేరకు ఆరోగ్య శాఖ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ కీలక ఆరోగ్య

-మిగతా 2 లో



## చంద్రబాబు సీఎంగా ఉండడం
# ఏపీ దురదృష్టం

- మావిగన్ పేరు చెబితే మూకుమ్మడి దాడులా
- ఇప్పటికే అమరావతికి రూ.47,387 కోట్లు అప్పు
- స్కామ్‌ల కోసం రాష్ట్ర ప్రజల వెన్ను విరుస్తున్న బాబు
- పెట్రో, డీజిల్ కొరతతోనూ ప్రజలకు చంద్రబాబు మోసం
- మీడియా సమావేశంలో మండిపడ్డ వైఎస్ జగన్

**అమరావతి మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండటం ఏపీ చేసుకున్న దురదృష్టమని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. ఏపీకి రాజధాని లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. మావిగన్ అంటే బాబుకు గుండె ఆగిపోయేలా ఉంది. చంద్రబాబు నిర్ణయాలతో భవిష్యత్‌లో కూడా రాజధాని లేకుండా చేస్తున్నారని వైఎస్ జగన్ మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ గురువారం మీడియాతో మాట్లాడుతూ..'చంద్రబాబు కారణంగా ఏపీ ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఇచ్చిన హామీలకు వెన్నుపోటు పొడిచారు. అమరావతిలో రోడ్లు, నీరు, డ్రైనేజీ, మౌలిక సదుపాయాలకే రూ.2లక్షల కోట్లు ఖర్చు అవుతుంది. ఆచరణ సాధ్యం

-మిగతా 2 లో

## కార్మికులకు ప్రభుత్వం
# శుభవార్త

### కనీస వేతనాలు అమలుకు నిర్ణయం

- కేబినేట్ సబ్‌కమిటీ నిర్ణయాలకు ఆమోదం
- లబ్దిపొందనున్న 1.11 కోట్ల మంది కార్మికులు
- బండి తనయుడు భగీరథను పోలీసులే అరెస్ట్ చేశారు
- కెటిఆర్ ఇంకా ప్రభుత్వంలోనే ఉన్నాడన్న భ్రమలో ఉన్నారు
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కార్మికులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కీలక విషయాలను వెల్లడించారు. కార్మికుల కనీస వేతనాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయా రని.. అందుకే ఉప ముఖ్యమంత్రి భట్టి

-మిగతా 2 లో






## పంటల కొనుగోలుపై
# ఎన్నాళ్లీ మొద్దునిద్ర?

- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగలేఖ
- రైతుల ప్రాణాలు పోతున్నా పంటలు కొనరా?
- ధాన్యం తగులబెట్టుకున్నా తండ్లాట తీర్చరా?
- కేంద్రాల్లోనే కుప్పకూలుతున్నా కనికరించరా?
- రైతులే రేపు సర్కార్‌కు కీలెరిగే వాతలు పెడుతరు
- 30 నెలల్లో సమైక్య పాలననాటి పరిస్థితులు

**హైదరాబాద్,**
'పంటల కొనుగోలుపై ఎన్నాళ్లీ ఈ మొద్దునిద్ర? రైతుల ప్రాణాలు పోతున్నా పంటలు కొనరా? కొనుగోలు కేంద్రాల్లోని వడ్ల రాశులపైనే కుప్పకూలుతున్నా కనికరించరా? కడుపు మండి ధాన్యం తగులబెట్టుకున్న అన్నదాతల తండ్లాట తీర్చరా? పంటలనే నమ్ముకొని రైతులు సంబురపడాల్సిన కొనుగోలు కేంద్రాల్లో ఈ మరణ మృదంగమేమిటి? చేతగాని, చేవచచ్చిన సర్కార్ వైఫల్యానికి పరాకాష్ట కాదా?' అని రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ తీరుపై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్లక్ష్య వైఖరిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి గురువారం కేటీఆర్ లేఖ రాశారు. పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకొనేందుకు రెండు నెలలుగా అన్నదాత పడుతున్న కష్టాలను ఆ లేఖలో ఏకరువు పెట్టారు. నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో రోడ్డెక్కని రైతులేడని, రాస్తారోకో జరుగని రహదారి లేదని పేర్కొన్నారు. నేడు ప్రభుత్వాన్ని బూతులు తిడుతున్న

-మిగతా 2 లో



# విజయ్ తొలి మంత్రివర్గ విస్తరణ

- ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు చోటు
- మంత్రిగా ప్రమాణం చేస్తూ రాహుల్ గాంధీ ప్రస్తావన
- వివాదమవుతున్న కొత్త మంత్రుల తీరు



చెన్నై:
ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వం విస్తరించింది. తొలి మంత్రివర్గ విస్తరణలో భాగంగా టీవీకే, కాంగ్రెస్‌కు చెందిన నాయకులు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. అయితే, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మంత్రి ఒకరు ప్రమాణం చేస్తూ ఆ పార్టీ అగ్రనేతల పేర్లను ప్రస్తావించడం వివాదానికి దారితీసింది.

-మిగతా 2 లో

## జూన్ 2 తర్వాత
# మద్యం ధరల బాదుడు!

- తయారీ వ్యయం పెరగడమే ధరల పెంపునకు ప్రధాన కారణం
- 10 నుంచి 15 శాతం మేర పెంపునకు మొగ్గు చూపుతున్న ప్రభుత్వం
- అధికారిక ప్రకటన వెలువడే అవకాశం



2 లో

## దేశంలో కాక్రోచ్
# ప్రకంపనలు!

### 5 రోజుల్లో ఇన్‌స్టాగ్రామ్‌లో 1.6 కోట్ల మంది ఫాలోవర్లు

- జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ ఖాతాల్ని దాటేసి ఎంతో ముందుకు
- లీగల్ డిమాండ్ పేరిట సీజేపీ ఎక్స్ ఖాతా నిలిపివేత
- 'కాక్రోచ్ ఈజ్ బ్యాక్' పేరిట వెంటనే కొత్త ఖాతా షురూ
- సీజేపీపై హక్కులను కోరుతూ 3 ట్రేడ్‌మార్క్ దరఖాస్తులు


**హైదరాబాద్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నిరుద్యోగులను బొద్దింకలతో పోల్చుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యల కారణంగా పుట్టుకొచ్చిన వ్యంగ్య రాజకీయ పార్టీ 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) దేశంలో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. గత శనివారం ప్రారంభమైన ఈ పార్టీ పేజీలను సోషల్ మీడియాలో ఫాలో అయ్యే నెటిజన్ల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతున్నది. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రస్తుతం ఈ పార్టీని 1.6 కోట్ల మంది ఫాలో అవుతున్నారు

-మిగతా 2 లో









2 లో

# పాక్ నుంచే పహల్గాం దాడి కుట్ర

- ఎన్ఐఏ ఛార్జ్‌షీట్‌లో సంచలన విషయాలు
- 'ఫాల్స్ ఫ్లాగ్' ప్రచారాన్ని కూడా పాక్ నడిపినట్లు వెల్లడి
- పాక్‌లో కొనుగోలు చేసిన మొబైల్ ఫోన్లు, టెలిగ్రామ్ ఛానళ్లతో కీలక ఆధారాలు



2 లో

## పుల్వామా దాడి
# సూత్రధారి హతం..

- పీవోకేలో కాల్చిచంపిన గుర్తు తెలియని వ్యక్తులు
- 40 మంది సీఆర్‌పీఫ్ జవాన్ల సజీవ దహనానికి కారణమైన పుల్వామా దాడితో పాటు కశ్మీర్‌లో పలు ఉగ్రవాద కార్యకలాపాల్లో అతడి ప్రమేయం

# ఇలాగైతే మిమ్మల్ని మోయలేం!

- మాట వినని ఎమ్మెల్యేలకు తెగేసి చెప్పిన చంద్రబాబు
- గ్రేస్ పీరియడ్ కూడా ముగిసింది!
- రెండేళ్లుగా చెబుతూ వస్తున్నా
- ఇక చెప్పడం ఉండదు.. చేతలే!
- ప్రభుత్వం ఎంత చేసినా.. మీ పనితీరు సరిగా లేకుంటే ఫలితం ఉండదు
- తమిళనాడు ఫలితాలే నిదర్శనం
- పొలిట్‌బ్యూరో భేటీలో సీఎం స్పష్టీకరణ
- ఈసారి మహానాడులో మహిళకే పెద్దపీట



**అమరావతి, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
'ప్రభుత్వం ఎంత బాగా పనిచేసినా.. క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేకుంటే ఫలితం ఉండదు. ఇటీవల జరిగిన తమిళనాడు ఎన్నికలే దీనికి నిదర్శనం. రెండేళ్లుగా పదే పదే ఎమ్మెల్యేల పనితీరు మార్చుకోమని చెబుతూ వస్తున్నాను.. ఇక చెప్పడం ఉండదు. చేతలే..! మాట వినని ఎమ్మెల్యేలను పార్టీ మోయదు' అని టీడీపీ అధినేత, సీఎం

-మిగతా 2 లో

# లిక్కర్‌పై.. జెన్‌జీ అనాసక్తి!

మొదటి తరువాయి

కేవలం నాలుగేళ్ల లోనే ప్రపంచంలోని టాప్ మద్యం కంపెనీలు ఏకంగా 830 బిలియన్ డాలర్స్ మార్కెట్ విలువను కోల్పోయాయి.

**కంపెనీల మార్కెట్ వాల్యూ అతలాకుతలం**

బ్లూమ్‌బెర్గ్ రిపోర్ట్ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దాదాపు 50 ప్రధాన మద్యం కంపెనీల షేర్లు ఘోరంగా పడిపోయాయి. ఇక జూన్ 2021 నాటి పీక్ స్టేజ్‌తో పోలిస్తే ఇప్పుడు ఈ కంపెనీల మార్కెట్ వాల్యూ 46% మేర పతనమైంది. జనాభా మద్యం తాగడం తగ్గించడమే ఇందుకు ప్రధాన కారణమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

**బ్రాండెడ్ కంపెనీల షేర్లలో భారీ క్షీణత**

మనం రెగ్యులర్‌గా వినే డియాజియో, పెర్నోడ్ రికార్డ్, జాక్ డానియెల్స్ లాంటి పెద్ద పెద్ద ఇంటర్నేషనల్ బ్రాండ్ల షేర్లు గత ఐదేళ్లలో ఎన్నడూ లేనంత గరిష్ట స్థాయికి పడిపోయాయి. ఇక ఫ్రెంచ్ చెందిన ఫేమస్ బ్రాండ్ 'రెమి కొయింట్రో' షేర్లు కూడా 2021తో పోలిస్తే 40% పైగా నష్టపోయాయి.

**మారిన కుర్రాళ్ల ట్రెండ్.. సెలబ్రిటీల ప్రభావం**

ఇప్పుడున్న యూత్ ఆల్కహాల్‌ను ఒక క్రేజీ విషయంగా చూడటం లేదు. హాలీవుడ్ స్టార్స్ టామ్ హాలండ్, కేటీ పేర్రీ లాంటి సెలబ్రిటీలు తాము మద్యానికి దూరంగా ఉంటున్నామని ప్రకటించడం కూడా కుర్రాళ్లపై బాగా ప్రభావం చూపించింది. ఇక 'నో-ఆల్కహాల్' లేదా 'ఆల్కహాల్ ఫ్రీ' లైఫ్‌స్టైల్ వైపు యువత మొగ్గు చూపుతోంది.

**బరువు తగ్గే మందులు, ఇతర కారణాలు**

ఆరోగ్య సంస్థల హెచ్చరికల వల్ల కూడా జనాలు అలవాట్లు మార్చుకుంటున్నారు. దీనికి తోడు బరువు తగ్గే మందులు వాడుతున్న వారు కూడా మద్యానికి దూరంగా ఉంటున్నారు. అలాగే అమెరికా లాంటి దేశాల్లో గంజాయి ప్రత్యామ్నాయంగా మారడం, చైనాలో ప్రభుత్వ ఫంక్షన్లలో మద్యంపై నిషేధం విధించడం కూడా మార్కెట్‌ను దెబ్బతీశాయి.

# ఎబోలా పై కేంద్రం హై అలర్ట్

మొదటి తరువాయి

మార్గదర్శకాలను విడుదల చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి భారత్‌కు వచ్చే ప్రయాణికులు, ఇమ్మిగ్రేషన్ తనిఖీలకు ముందే ఆరోగ్య అధికారులను సంప్రదించాలని కోరింది. ముఖ్యంగా డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డీఆర్‌సీ), ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు ఎబోలా లక్షణాలు కనిపిస్తే వెంటనే ఎయిర్‌పోర్ట్ ఆరోగ్య అధికారులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఇటీవల కాంగో, ఉగాండాలో వైరస్ వ్యాప్తిపై 'గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ' ప్రకటించిన నేపథ్యంలో కేంద్రం ఈ చర్యలు చేపట్టింది. అయితే ఇది ప్రపంచవ్యాప్త మహమ్మారి కాదని డబ్ల్యూహెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అథనామ్ గెబ్రియేసస్ స్పష్టం చేశారు.

అడ్వైజరీలోని సూచనలు

కేంద్ర ఆరోగ్య శాఖ విడుదల చేసిన అడ్వైజరీ ప్రకారం, ఎబోలా ప్రభావిత దేశాల నుంచి భారత్‌కు చేరుకునే ప్రయాణికులు జ్వరం, తీవ్ర అలసట, నీరసం, తలనొప్పి, కండరాల నొప్పులు, వాంతులు, విరేచనాలు, గొంతు నొప్పి, శరీరంలో అనూహ్య రక్తస్రావం వంటి లక్షణాలు ఉంటే వెంటనే విమానాశ్రయంలోని ఆరోగ్య విభాగానికి సమాచారం ఇవ్వాలి. ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే తమ ఆరోగ్య పరిస్థితిని వెల్లడించాలని అధికారులు సూచిం చారు. అలాగే ఎబోలా అనుమానితులు లేదా నిర్ధారిత రోగుల రక్తం, శరీర ద్రవాలతో నేరుగా సంబంధం కలిగిన ప్రయాణికులు కూడా వెంటనే ఆరోగ్య అధికారులను సంప్రదించాలని డీజీహెచ్ఎస్ పేర్కొంది. ఇది ఇతర ప్రయాణికుల భద్రత దృష్ట్యా అత్యంత కీలకమని పేర్కొంది. అదేవిధంగా, భారత్‌కు వచ్చిన తర్వాత 21 రోజుల లోపు ఎవరైనా పైన చెప్పిన లక్షణాలతో బాధపడితే వెంటనే వైద్యులను సంప్రందించాలని, తమ ప్రయాణ చరిత్రను అధికారులకు వెల్లడించాలని సూచించింది.

# దేశంలో కాక్రోచ్ ప్రకంపనలు!

మొదటి తరువాయి

దేశవ్యాప్తంగా లక్షలాది మంది కార్యకర్తలు ఉన్నట్టు చెప్పుకొనే జాతీయ పార్టీలకు కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో ఇంతమంది ఫాలోవర్లు లేకపోవడం గమనార్హం. 141 ఏండ్ల కిందట ఏర్పడిన కాంగ్రెస్ పార్టీకి ఇన్‌స్టాలో 1.33 కోట్ల మంది ఫాలోవర్లు ఉండగా, 46 ఏండ్ల కిందట ఏర్పడిన బీజేపీకి 88 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. అయితే, ప్రారంభించిన ఐదు రోజుల్లోనే సీజేపీ ఇన్‌స్టా పేజీకి 1.6 కోట్ల మంది ఫాలోవర్లు రావడం గమనార్హం.

**కాక్రోచ్ ఈజ్ బ్యాక్**

సోషల్‌మీడియాలో సంచలనాలను సృష్టిస్తున్న సీజేపీ ఎక్స్ ఖాతాను భారత్‌లో నిలిపేశారు. చట్టపరమైన డిమాండ్ పేరిట ఖాతాను నిలిపివేశారంటూ సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, సీజేపీ ఎక్స్ ఖాతా నిలిపేసిన గంటల వ్యవధిలోనే ఆ డిజిటల్ అవుట్‌ఫిట్ నుంచి కొత్త ఖాతా క్రియేట్ అయ్యింది. 'కాక్రోచ్ ఈజ్ బ్యాక్' పేరిట ప్రారంభమైన ఈ ఖాతాను నిమిషాల వ్యవధిలో వేలాది మంది ఫాలో కావడం గమనార్హం. 'నిన్న మా ఎక్స్ ఖాతాను హ్యాక్ చేసే ప్రయత్నాలు జరిగాయి. ఇప్పుడు ఖాతాను నిలిపేశారు. ఇలాంటిది ఏదో ఒకటి జరుగుతుందని మేము ముందే ఊహించాం. అందుకే, 'కాక్రోచ్ ఈజ్ బ్యాక్' అనే ఖాతాతో మా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాం. ప్రస్తుత పరిణామాలను న్యాయపరంగా పరిష్కరించుకొంటాం' అని అభిజీత్ వెల్లడించారు.తెలంగాణ సమాచారం

**ట్రేడ్ మార్క్ దరఖాస్తులు**

సీజేపీ పేరుపై హక్కులను కోరుతూ మూడు వేర్వేరు ట్రేడ్‌మార్క్ దరఖాస్తులు దాఖలయ్యాయి. అయితే, సీజేపీని స్థాపించిన అభిజీత్ కాకుండా వేర్వేరు వ్యక్తులు ఈ దరఖాస్తులను దాఖలు చేయడం గమనార్హం. అజీమ్ అడంభాయ్ జామ్, అఖండ్ స్వరూప్ అనే వ్యక్తులతో పాటు కాక్రోచ్ జనతా పార్టీ అనే యాజమాన్య సంస్థ వేర్వేరుగా సీజేపీ పేరు కోసం దరఖాస్తులు చేసినట్టు సమాచారం.

# పుల్వామా దాడి సూత్రధారి హతం..

**న్యూఢిల్లీ:**

2019 పుల్వామా దాడి సూత్రధారుల్లో ఒకరైన హమ్జా బుర్హాన్ హతమయ్యాడు. పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో అతడిని గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిచంపారు. ముజఫరాబాద్‌లో ఈ ఘట న జరిగింది. పుల్వామాకు చెందిన బుర్హాన్ 2017లో ఉన్నత చదువుల నిమిత్తం పాక్ వెళ్లి అక్కడ నిషేధిత అల్-బద్ సంస్థలో చేరి కమాండర్ స్థాయికి ఎదిగాడు.ఆ తర్వాత కశ్మీర్ తిరిగి వచ్చి యువతలో ఉగ్రవాద బీజాలు నాటాడు. ఫిబ్రవరి 14, 2019లో 40 మంది సీఆర్‌పీఫ్ జవాన్ల సజీవ దహనానికి కారణమైన పుల్వామా దాడితో పాటు కశ్మీర్‌లో పలు ఉగ్రవాద కార్యకలాపాల్లో అతడి ప్రమేయం ఉన్నది.

# చంద్రబాబు సీఎంగా ఉండడం ఏపీ దురదృష్టం

మొదటి తరువాయి

కాదని తెలిసినా అమరావతిపై ముందుకు వెళ్తున్నారు. స్కామ్‌ల కోసమే చంద్రబాబు ముందుకెళు తున్నారు. ఇప్పటికే అమరావతికి రూ.47,387 కోట్లు అప్పు చేశారు. ఖజానా నుంచి రూ.9200 కోట్లు ఖర్చు చేయబోతున్నారు. స్కామ్‌ల కోసం రాష్ట్ర ప్రజల వెన్ను విరుస్తున్నారు. ప్రశ్నిస్తే చంద్రబాబుకు బీపీ పెరుగుతోంది. రాష్ట్రానికి రాజధాని ఉండాలనే మావిగన్‌ను ప్రతిపాదించాం. రాష్ట్ర పరిస్థితుల దృష్ట్యా మావిగన్‌ను ప్రత్యామ్నాయంగా చూపించాం అన్నారు. అమరావతి అయితే జీరో నుంచి మొదలుపెట్టాలి. చంద్రబాబు స్కామ్‌ల కోసం ఏపీని ఇబ్బంది పెడుతున్నారు. ప్రజలకు కూడా మావిగన్‌కు మద్దతు పలికారు. అది తట్టుకోలేక చంద్రబాబు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు. మంత్రులతో కూడా బూతులు మాట్లాడిస్తున్నారు. రూ.1200 కోట్లతో అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ ఉన్నా మళ్లీ అన్నీ కొత్తగా కడతానంటున్నారు. కొత్తగా నిర్మిస్తున్న 5 బిల్డింగ్‌ల నిర్మాణం పేరుతో చంద్రబాబు దోపిడీ చూస్తే ప్రజలు నివ్వెరపోతున్నారు. భవన డిజైన్లకే రూ.401 కోట్లు. ఈ ఐదు బిల్డింగులకు అయ్యే మొత్తం ఖర్చు రూ. 10,665 కోట్లు.. అంటే ప్రస్తుతం చదరపు అడుగుకు రూ.20,427?. వాటి ఫర్నీచర్, ఇంటీరియర్ ఇంకా అదనపు ఖర్చులన్నమాట.. అంటే చదరపు అడుగుకు రూ.30 వేలు దాటుతుందన్న మాట. మళ్లీ ఇవే నిర్మాణాలకు కొత్త టెండర్లు పిలిచారు.. కానీ, పాత వాళ్లకే ఇచ్చారు. ÷వ్‌స్టార్ హోటల్స్‌కు కూడా చదరపు అడుగు రూ.4,500 లోపే!. తెలంగాణలో రూ.615 కోట్లతో కేసీఆర్ సచివాలయం కట్టారు. మన సెక్రటేరియట్‌కు మాత్రం ఇంత ఖర్చా? ఎందుకు?. కొత్త అసెంబ్లీ, కొత్త హైకోర్టు అంటూ మళ్లీ భారీగా ఖర్చు చేయబోతున్నారు. ఇదంతా విచ్చలవిడిగా చేస్తున్న దోపిడీనే' అని తెలిపారు. ప్రతిపక్ష పార్టీగా గత రెండేళ్లుగా తాము ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నిస్తున్నామని జగన్ తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్‌తో పాటు మొత్తం 143 హామీల అమలు గురించి ప్రజలు కూడా సమాధానం కోరుతున్నారని అన్నారు. పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకోలేదని జగన్ విమర్శించారు. 2014-19 మధ్య కాలంలో కోవిడ్ వంటి క్లిష్ట పరిస్థితులు లేకపోయినా, 2015 ఫిబ్రవరిలో లీటర్‌కు రూ.4 చొప్పున పెట్రోలు, డీజిల్‌పై అదనపు భారం మోపారని గుర్తు చేశారు.

# కార్మికులకు ప్రభుత్వం శుభవార్త

మొదటి తరువాయి

విక్రమార్క ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీని నియమించామని అన్నారు. సబ్ కమిటీ నివేదించిన అంశాలపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు. కార్మికులను నాలుగు కేటగిరీలుగా చేశాం. అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్‌గా విభజించాం. వర్క్ జోన్లను మూడు భాగాలుగా విభజించాం. జోన్-1లో మున్సిపల్ కార్పొరేషన్స్, జోన్-2లో మున్సిపాలిటీలు, జోన్-3లో గ్రామీణ ప్రాంతాలను తీసుకుని కనీసవేతనం నిర్ణయించాం అన్నారు. అన్‌స్కిల్డ్ కేటగిరీలో కనీస వేతనాన్ని రూ.12,750 నుంచి రూ.16 వేలకు పెంచాం. సెమీ స్కిల్డ్ కేటగిరీలో రూ.13,152 నుంచి రూ.17 వేలకు.. స్కిల్డ్ కేటగిరీలో రూ.13,772 నుంచి రూ.18,500కు పెంచాం. హైలీ స్కిల్డ్ కేటగిరీలో రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచాం. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జూన్ 1, 2026 నుంచి అమలవుతుంద

ని అన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటిసారిగా కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయం ఇది. గత ప్రభుత్వం తన బాధ్యతను వదిలేసింది. మా ప్రభుత్వం బాధ్యతతో వారి ప్రయోజనం కోసం నిర్ణయం తీసుకుంది. కార్మిక నాయకుడంటే వెంకటస్వామి గుర్తొస్తారు. ఆయన వారసుడిగా మంత్రి వివేక్ వెంకటస్వామి.. కార్మికుల



సంక్షేమం కోసం మంచి నిర్ణయం తీసుకున్నారు. యువతకు నేను ఒకటే సూచన చేస్తున్నా. ఐటీ, అమెరికా అనే ఆలోచనను వీడండి. ఉద్యోగాలు రాని, ఉపాధి అవకాశాలు లేని చదువులు వ్యర్థం. సాంకేతిక నైపుణ్యంతో జర్మనీ, జపాన్, సింగపూర్ లాంటి ఇతర దేశాల్లో అనేక అవకాశాలు ఉన్నాయి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహిస్తోంది. ఆ దిశగా యువత దృష్టి సారించాలని సూచించారు. ప్రజా సమస్యలను, దేశాల మధ్య యుద్ధాన్ని బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తోంది. అందుకే ఎన్నికలు అయిపోగానే పెట్రోల్, డీజిల్ ధరలను రోజుకోసారి పెంచుతున్నారు. మా ప్రభుత్వం ప్రతి అంశాన్నీ దీర్ఘకాలిక దృష్టితో చూస్తుంది. అందుకే కార్మికుల కనీస వేతనం పెంపుపై నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ 80 శాతం పూర్తయింది. ఇంకా 20 శాతం మిగిలి ఉంది. ఆ ప్రక్రియ కూడా త్వరలోనే పూర్తి చేస్తాం. బీఆర్ఎస్ నేతలు మానవత్వం మరిచిపోయి వ్యవహరిస్తున్నారు. రైతుల విషయంలో శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారు. రాజకీయాల కోసం మరీ ఇంత దిగజారి వ్యవహరిస్తారా?. నిజంగా రైతులపై ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. పోక్సో కేసులో బండి భగీరథ్‌ను పోలీసులే అరెస్ట్ చేశారని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడిని అప్పగించి ఉంటే తమ ఇంట్లోనే అప్పగించి ఉండేవారు. పోక్సో కేసులో ఏదో సాధించినట్లు బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే ఎన్నికల్లో ఓడించాలి.. అంతేకాని దిగజారి ప్రవర్తించొద్దు. కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ దొరికినా నోటీసు ఇచ్చి విచారించాం. బండి భగీరథ్ విషయంలోనూ నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నాం. పోక్సో కేసులో పోలీసులు ప్రొసీజర్ ప్రకారమే వ్యవహరిస్తున్నారు. కేటీఆర్ ఇంకా కల్వకుంట రాజ్యాంగంలోనే ఉన్నానని అనుకుంటున్నారని అంటూ ఎద్దేవా చేశారు. కేసీఆర్ దిగిపోయి చాలా రోజులు అయ్యింది. పార్టీ మీటింగ్ కోసం జగిత్యాలకు వెళ్లిన కేసీఆర్.. రాష్ట్రంలో ఇంత పెద్ద సంఘటన జరిగితే ఎందుకు బయటకు రాలేదు?. కులగణన విషయంలో సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. తెలంగాణ నిర్ణయాన్ని ఉన్నత న్యాయస్థానం సమర్థించడం మాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాం. తెలంగాణలో జనగణనతో పాటు కులగణన చేసి అన్ని వివరాలు ప్రజల ముందుంచాం. 'జనగణనలో కులగణన' విషయంలో తెలంగాణ దేశానికి దిక్సూచిగా నిలిచింది. మోదీ ప్రభుత్వం తక్షణమే జనగణనలో కులగణన చేర్చి బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలి' అని అన్నారు.

# పంటల కొనుగోలుపై ఎన్నాళ్లీ మొద్దునిద్ర?

మొదటి తరువాయి

రైతులే రేపు కీలెరిగి వాతలు పెడుతారని హెచ్చరించారు. వడ్ల కొనుగోలుకు కాంటా పెట్టని కాంగ్రెస్ సర్కార్‌కు రైతన్న చేతిలోనే కౌంట్‌డౌన్ మొదలైందని స్పష్టంచేశారు.తెలంగాణ సమాచారం

అరాచక పాలనకు ఆనవాళ్లు

తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ పాలనలో కొం డంత ధైర్యంతో బతికిన అన్నదాత.. కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలనలో ఆత్మవిశ్వాసం కోల్పోయి రోడ్డున పడ్డాడని సీఎంకు రాసిన లేఖలో కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఆరు దశాబ్దాల కష్టాలు శాశ్వతంగా తీరిపోయానని సంబురంగా సాగు చేసుకుంటున్న రైతన్నల నోట్లో కాంగ్రెస్ మట్టికొట్టిందని దుయ్యబట్టారు. రైతుకు రక్షణగా కేసీఆర్ అమలు చేసిన పథకాలకు రేవంత్ సర్కార్ పాతరేసి అన్నదాత వెన్ను విరిచిందని మండిపడ్డారు. కాంగ్రెస్ అరాచక పాలన ఆనవాళ్లు పరాకాష్టకు చేరాయని తూర్పారబట్టారు. పెట్టుబడి సాయా న్ని నాలుగుసార్లు ఎగ్గొట్టినా, యూరియా కష్టాల పాల్జేసినా వాటిని అధిగమించి పంటలు పండిస్తే కొనుగోలు చేసే నాథుడే లేడని ధ్వజమెత్తారు. 'మీరు చేసిన ద్రోహంతోపాటు వడదెబ్బ బారిన పడి 10 మందికి పైగా రైతులు ప్రాణాలు విడిచారు. 30 నెలల్లో సమైక్య పాలనలోని పరిస్థితులను తెచ్చి రైతులను నిండాముంచారు. ఇన్నాళ్లు సంతోషంగా సాగిన సాగును కన్నీటి సేద్యంగా మార్చారు. రైతుల కన్నీళ్లతో ఖాళీగా ఉన్న రిజర్వాయర్లు నిండేలా ఉన్నాయి' అని పేర్కొన్నారు. 'చివరికి మీ సొంత నియోజకవర్గమైన కొడంగల్ రైతులు సైతం రోడ్డెక్కి దుమ్మెత్తిపోసే దుస్థితి వచ్చిందంటే సంక్షోభంలో చిక్కుకున్న సాగు పరిస్థితికి అద్దంపడుతుంది' అని స్పష్టంచేశారు.

**ముక్కునేలకు రాసి క్షమాపణలు చెప్పండి**

వరంగల్ నుంచి ఖమ్మందాకా కొనుగోలు కేంద్రాల్లో ఒక్క లారీ లోడ్ కూడా ఎత్తడం లేదని కేటీఆర్ పేర్కొన్నా రు. 'కొనుగోలు చేసిన పంటలోనూ క్వింటాకు 10 కిలోలకు పైగా తరుగు పెడితే రైతుకు మిగిలేదేంటో చెప్పాలి.. గన్నీ బ్యాగుకు రూ.50 డిపాజిట్ చేయాల్సి రావడం సిగ్గుచేటని తె లిపారు. 'బోనస్ ఇచ్చే ముఖం మీ సర్కార్‌కు ఎలాగూ లేదు.. కనీసం వడ్లను సైతం కొనుడు చేతగాకుంటే ముక్కునేలకు రాసి 60లక్షల మంది రైతులకు క్షమాపణ చెప్పా లి' అని డిమాండ్ చేశారు. రైతులు గోసప డుతుంటే పర్యాటక వారోత్సవాలు జరుపుకోవడం బాధాకరమని మండిపడ్డారు. రేవంత్ చేసిన సాగుద్రోహానికి ఇప్పటివరకూ వెయ్యి మందికిపైగా రైతులు బలైపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్రాల్లో చనిపోయిన రైతుల కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున పరిహారం అందజేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# విజయ్ తొలి మంత్రివర్గ విస్తరణ

మొదటి తరువాయి

దీనిపై గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ సీరియస్ అయ్యారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజేష్ కుమార్, విశ్వనాథన్‌లకు విజయ్ క్యాబినెట్‌లో చోటు దక్కింది. కుమార్ వేదికపై ప్రమాణపత్రాన్ని చదువుతూ.. తన ప్రమాణస్వీకారాన్ని ముగించారు. ఆ తరువాత కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ, కామరాజ్ (తమిళనాడు దివంగత నేత), రాహుల్ గాంధీ ల పేర్లను ప్రస్తావించారు. దీనిపై గవర్నర్ సీరియస్‌గా స్పందించారు. 'అది మీ ప్రమాణంలో భాగం కాదు' అంటూ మందలించారు. అనంతరం రాజేష్ కుమార్ తన ప్రమాణపత్రంపై సంతకం చేసి అక్కడినుంచి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఈ సంఘటన చర్చనీయాంశంగా మారింది.

పాటపై మరో వివాదం..

ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముందు రాష్ట్ర గీతాన్ని చివరిలో ఆలపించడం పైనా వివాదం చెలరేగింది. కార్యక్రమంలో వందేమాతరం, జాతీయగీతం తర్వాత తమిళ గీతాన్ని ఆలపించడంపై వామపక్ష పార్టీలు అభ్యంతరం తెలిపాయి. దీనిపై సీపీఐ కార్యదర్శి ఎం.వీరపాండియన్ విలేకరులతో మాట్లాడుతూ.. తమిళనాడు గవర్నర్ రాష్ట్ర గీతానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. జాతీయగీతాన్ని తాము గౌరవిస్తున్నామని స్పష్టం చేశారు. అయితే, ఈ వివాదంపై సీఎం విజయ్ దగ్గర తాము ప్రస్తావించామని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం తెలిపారు. గవర్నర్ పాల్గొనే అన్ని కార్యక్రమాల్లోనూ మొదట వందేమాతరమే ఆలపిస్తారని సీఎం స్పష్టం చేసినట్లు వెల్లడించారు. కాగా.. సీఎంగా విజయ్ ప్రమాణస్వీకారం చేసిన రోజు కూడా ఇదే విషయంపై వివాదం తలెత్తింది. ఇక, కొత్తగా ఏర్పడిన తమిళనాడు ప్రభుత్వంలోకి టీవీకేకు చెందిన 21 మంది, కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు సహా మొత్తం 23 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు.

# జూన్ 2 తర్వాత మద్యం ధరల బాదుడు!

**-తయారీ వ్యయం పెరగడమే**
**ధరల పెంపునకు ప్రధాన కారణం**
**-10 నుంచి 15 శాతం మేర**
**పెంపునకు మొగ్గు చూపుతున్న ప్రభుత్వం**
**-అధికారిక ప్రకటన వెలువడే అవకాశం**



హైదరాబాద్ :

తెలంగాణలో మద్యం ప్రియులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. రాష్ట్రంలో త్వరలోనే అన్ని రకాల మద్యం, బీర్ల ధరలు పెరగనున్నాయి. రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 తర్వాత ధరల పెంపుపై అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్ర ఖజానాకు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత కొంతకాలంగా మద్యం తయారీ కంపెనీల నుంచి ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి వస్తోంది. ముడిసరుకుల ధరలు, ముఖ్యంగా సీసాల తయారీ ఖర్చు పెరగడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. పశ్చిమాసియా యుద్ధం, కమర్షియల్ గ్యాస్ ధరలు రెట్టింపు కావడం వంటి కారణాలతో సీసాల తయారీ వ్యయం 15 నుంచి 20 శాతం వరకు పెరిగిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ధరలను సవరించాలని కంపెనీలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. మద్యం ధరల పెంపు, ఆదాయ వనరులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం గతంలోనే ఓ త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, పొరుగు రాష్ట్రాల్లోని ధరలను విశ్లేషించిన ఈ కమిటీ రాష్ట్రంలో 25 నుంచి 30 శాతం వరకు ధరలు పెంచవచ్చని ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. అయితే, ఒకేసారి ఇంత భారీగా పెంచితే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందన్న ఆలోచనతో ప్రభుత్వం సుమారు 10 నుంచి 15 శాతం మేరకే పెంపునకు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఈ పెంపు నిర్ణయం అమలైతే సాధారణ, మీడియం బ్రాండ్లతో పాటు ప్రీమియం బ్రాండ్ల ధరలు కూడా పెరగనున్నాయి. పెరిగిన ధరల ద్వారా ప్రభుత్వానికి అదనపు ఆదాయం లభించనుండగా, మద్యం ప్రియులపై మాత్రం భారం పడనుంది. ఆర్థిక, అబ్కారీ శాఖలు దీనికి సంబంధించిన కసరత్తును ఇప్పటికే పూర్తి చేసినట్లు తెలుస్తోంది.

# ఇలాగైతే మిమ్మల్ని మోయలేం!

మొదటి తరువాయి

చంద్రబాబు స్పష్టం చేశారు. ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా గురువారం పొలిట్‌బ్యూరో సమావేశాన్ని వర్చువల్ విధానంలో నిర్వహించారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయం నుంచి చంద్రబాబు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ పాల్గొనగా.. వేర్వేరు ప్రదేశాల నుంచి మిగిలిన 27 మంది పొలిట్‌బ్యూరో సభ్యులు హాజరయ్యారు. ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే మహానాడుపై చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు.. పార్టీ ఎమ్మెల్యేల పనితీరుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్లో ఇటీవలి ఎన్నికల్లో అధికార పార్టీలు ఓటమి పాలయ్యాయి. బెంగాల్లో శాంతిభద్రతల వైఫల్యం తీవ్రంగా ప్రభావితం చేసింది. అధికార పార్టీ నేతల అరాచకాలను ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం అభివృద్ధిపరంగా బాగాచేసినా ఎమ్మెల్యేల అవినీతి ఆ పార్టీ ఓటమికి కారణమైంది.

కేరళలో లెఫ్ట్ కూటమి ఓటమికి అవినీతి.. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ ఉదాసీనత ప్రధాన కారణాలుగా నిలిచాయి. వీటిని అర్థం చేసుకుని మన పనితీరును చక్కదిద్దుకుంటే 2029 ఎన్నికల్లో మన గెలుపును ఎవ్వరూ ఆపలేరు' అని తేల్చిచెప్పారు. పార్టీ లైన్ దాటి పనిచేసే వారు తమను తాము సరిదిద్దుకోవడానికి ఇదే సరైన సమయమన్నారు. తర్వాత బాధపడి ప్రయోజనం ఉండదని.. అలాంటి వారిని ఉపేక్షించే ప్రశ్నే లేదన్నారు. తప్పు చేసినా మిమ్మల్ని మోస్తానని మాత్రం అనుకోవద్దన్నారు.

# పాక్ నుంచే పహల్గాం దాడి కుట్ర

న్యూఢిల్లీ:

జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో 2025 ఏప్రిల్‌లో జరిగిన ఘోర ఉగ్రదాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పాకిస్తాన్ కేంద్రంగా నడిచిన భారీ కుట్ర వెలుగులోకి వచ్చింది. లష్కరే తొయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టిఆర్ఎఫ్) హ్యాండ్లర్లు పాకిస్తాన్ నుంచి ఈ దాడిని నడిపినట్లు ఎన్ఐఏ పేర్కొంది. అలాగే 'ఫాల్స్ ఫ్లాగ్' ప్రచారాన్ని కూడా పాక్ నుంచే నడిపినట్లు ఎన్ఐఏ వెల్లడించింది.

పాక్ ఐపీ అడ్రస్ల గుర్తింపు- 'ఫాల్స్ ఫ్లాగ్' ప్రచారం బట్టబయలు

ది రెసిస్టెన్స్ ఫ్రంట్ హ్యాండ్లర్లు పాక్ నుంచి ఈ ఉగ్రదాడికి వ్యూహ రచన చేసినట్లు ఎన్ఐఏ తెలిపింది. దాడి జరిగిన వెంటనే 'కశ్మీర్ ఫైట్' అనే టెలిగ్రామ్ ఛానల్ ద్వారా 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' బాధ్యత స్వీకరించినట్లు ఎన్ఐఏ పేర్కొంది. అయితే అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర విమర్శలు రావడం, ఐరాస భద్రతామండలి దాడిని ఖండించడంతో టీఆర్ఎఫ్ వెనక్కి తగ్గి తమ ఛానల్ హ్యాక్ అయిందని చెప్పినట్లు వెల్లడించింది. ఎన్ఐఏ సాంకేతిక దర్యాప్తులో 'కశ్మీర్ ఫైట్' ఛానల్ పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రంలోని బట్టగ్రామ్ ప్రాంతం నుంచి నడిచినట్లు తెలిసింది. 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ - అఫీషియల్' అనే మరో ఛానల్ రావల్పిండి నుంచి నిర్వహించినట్లు గుర్తించింది. దాడిని భారత్ చేసిందన్న తప్పుడు ప్రచారాన్ని ప్రపంచాన్ని తప్పుదారి పట్టించేందుకు పాక్ ప్రణాళికాబద్ధంగా నడిపించిందని ఎన్ఐఏ పేర్కొంది.

# నేటి రాశి ఫలితాలు





**మేషరాశి**
దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అవుతాయి. స్థిరాస్తి వివాదాలు తీరతాయి. ధార్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. కొత్త పనులకు శ్రీకారం చుడతారు. ఆర్థిక విషయాలు సంతృప్తినిస్తాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. దక్షిణామూర్తి నామ స్మరణ శుభకరం

**వృషభరాశి**
ఆర్థిక వ్యవహారాలు చికాకు పరుస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. మిత్రులతో దైవదర్శనాలు చేసుకుంటారు. కుటుంబ సభ్యులతో మాట పట్టింపులు కలుగుతాయి. ముఖ్య వ్యవహారాలలో ప్రతిబంధకాలు ఉంటాయి. వ్యాపారాలు కొంత మందగిస్తాయి. ఉద్యోగాలలో అధికారులతో చికాకులు పెరుగుతాయి. నందీశ్వరుని నామస్మరణ శుభకరం

**మిధునరాశి**
ఆత్మీయుల నుంచి శుభవార్తలు అందుతాయి. ఆకస్మిక ధన లాభ సూచనలు ఉన్నవి. విలువైన వస్తు లాభాలు పొందుతారు. చాలా కాలంగా పడిన శ్రమ ఫలిస్తుంది. నూతన పనులు చేపడతారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగాలు ఆశాజనకంగా ఉంటాయి. తల్లిదండ్రుల ఆశీస్సులు శుభకరం

**కర్కాటకరాశి**
చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. బంధువులతో మాటపట్టింపులు కలుగుతాయి. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు ఉంటాయి. ఇంటా బయట పరిస్థితులు అనుకూలించవు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు కొంత నిదానంగా సాగుతాయి. ఉద్యోగ విషయమై అధికారులతో చర్చలు అనుకూలించవు.

**సింహరాశి**
సన్నిహితుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆకస్మిక ధన లాభ సూచనలు ఉన్నవి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. సంఘంలో విశేషమైన గౌరవ మర్యాదలు పొందుతారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. నూతన గృహ నిర్మాణ ప్రయత్నాలు ప్రారంభిస్తారు. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. గురువు నామస్మరణ శుభకరం

**కన్యరాశి**
వివాదానికి సంబంధించి ప్రముఖుల నుంచి అందిన సమాచారం ఊరట కలిగిస్తుంది. ఆర్థికంగా మరింత మెరుగైన వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వృత్తి వ్యాపారాలలో నష్టాల నుండి బయటపడగలుగుతారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇంటి ఆడపిల్లల ఆశీస్సులు శుభకరం

**తులరాశి**
ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. సన్నిహితులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. దూర ప్రయాణ సూచనలున్నవి. కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. చేపట్టిన పనుల్లో ప్రతిష్టంభనలు కలుగుతాయి. వ్యాపారపరంగా కొంత మెరుగైన పరిస్థితులు ఉంటాయి. ఉద్యోగస్తులకు పని ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుంది. కుజుని నామస్మరణ శుభకరం

**వృశ్చికరాశి**
సోదరులతో కలహా సూచనలు ఉన్నవి. నూతన ఋణాలు చేస్తారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. గృహమున ఆకస్మికంగా నిర్ణయాలు మార్పులు చేస్తారు. వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఉద్యోగాలలో ఊహించని స్థానచలన సూచనలు ఉన్నవి. బాలాజీ నామస్మరణ శుభకరం

**ధనస్సురాశి**
కుటుంబ సభ్యుల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. మిత్రులతో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ఉద్యోగాలలో మీ అంచనాలు నిజమవుతాయి. లక్ష్మీ నరసింహ స్వామి నామస్మరణ శుభకరం

**మకరరాశి**
తలపెట్టిన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. ఆకస్మిక ధనలాభాలు ఉన్నవి. భూవివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. పలుకుబడి కలిగిన వ్యక్తుల పరిచయాలు విస్తృతం అవుతాయి. వ్యాపార వ్యవహారాలలో ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగాలలో సమస్యలు పరిష్కారం అవుతాయి. గురుదేవుని ఆశీస్సులు శుభకరం

**కుంభరాశి**
కొత్త ఋణయత్నాలు సాగిస్తారు. చేపట్టిన పనుల్లో ఆటంకాలు కలుగుతాయి. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. వ్యాపారాలలో కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి. మిత్రులతో కలహా సూచనలు ఉన్నవి. ఉద్యోగస్తులకు అధికారుల నుండి ఊహించని ఇబ్బందులు ఎదురవుతాయి. సూర్య దేవుని నామస్మరణ శుభకరం

**మీన రాశి**
అనవసర ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ వాతావరణం చికాకుగా ఉంటుంది. ఆరోగ్య సమస్యలు మరింత బాధిస్తాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. కొన్ని పనులు వ్యయప్రయాసలతో కానీ పూర్తి కావు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. పితృదేవతల ఆశీస్సులు శుభకరం



శ్రీ కాలభైరవ ఉపాసకులు
డక్క జంబులయ్య (స్వామి)
94911639 14

## ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు







**అచ్చంపేట/కల్వకుర్తి/వెల్దండ,మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేశానికి ఆధునికతను అందించిన దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు గురువారం తెలంగాణలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.అచ్చంపేట పట్టణంలో పిసిసి ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. “ఆధునిక భారత నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారు. యువతకు సాంకేతిక విప్లవం, సమాచార సాంకేతిక రంగ అభివృద్ధి ఆయన కృషి చిరస్మరణీయం” అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజిత మల్లేష్, గ్రంధాలయ చైర్మన్ రాజేందర్, మాజీ ఎంపీపీ రామనాథం, టౌన్ అధ్యక్షుడు ఖాదర్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారువెల్దండ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, డీసీసీ ఉపాధ్యక్షుడు భూపతిరెడ్డి నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల అధ్యక్షుడు హరికిషన్, ప్రధాన కార్యదర్శి మోతిలాల్ నాయక్, సర్పంచ్ మట్ట యాదమ్మ, ఉప సర్పంచ్ శీను, సేవాదళ్ ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.కల్వకుర్తి పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు జరిగాయి. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పసుల సుదర్శన్ రెడ్డి, సీనియర్ నాయకులు మిర్యాల శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్, జిల్లా కార్యదర్శి ఖలీల్, కౌన్సిలర్లు, మాజీ వైస్ ఎంపీపీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధిహామి కూలీల సంఖ్యను పెంచాలి

అడిషనల్ డీఆర్డీవో మల్లేశ్



**ఎలిగేడు, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉపాధిహామి పథకంలో కూలీలకు మరిన్ని పనులు కల్పించి, కూలీల సంఖ్యను పెంచాలని అడిషనల్ డీఆర్డీవో మల్లేశ్ సూచించారు.ఎలిగేడు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బాస్కర్ రావు ఆధ్వర్యంలో ఉపాధి సిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ, “గ్రామాల్లో నర్సరీల నిర్వహణ సక్రమంగా జరగాలి. మొక్కలు ఎండిపోకుండా నీరు పట్టాలి. ఉపాధి పనుల్లో కూలీలకు సమాన అవకాశాలు కల్పించాలి” అని అన్నారు.కార్యక్రమంలో ఏపీడీ సత్యనారాయణ, టీఏ రంజిత్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

డివిజనల్ పంచాయతీ అధికారి దేవకీదేవి



శివ పల్లి లో పారిశుద్ధ పనులను పరిశీలిస్తున్న డివిజనల్ పంచాయతీ అధికారి దేవకీదేవి



**ఎలిగేడు, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు సక్రమంగా జరగాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని డివిజనల్ పంచాయతీ అధికారి దేవకీదేవి హెచ్చరించారు.గురువారం ఆమె ఎలిగేడు మండలంలోని శివపల్లి, నర్సాపూర్, ఎలిగేడు గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరుచేసి సక్రమంగా నిర్వహించాలని సూచించారు.నర్సాపూర్ గ్రామంలో పేపర్ ప్లేట్ల కేంద్రంలో చెత్తను గమనించి రూ.5,000 జరిమానా విధించారు. ఎలిగేడు గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు దుగ్యాల వాణి, పల్లెర్ల వెంకటేశ్ గౌడ్, కప్పల ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధునిక భారత నిర్మాత రాజీవ్ గాంధీ

- మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్



**ఆమనగల్లు, మే 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆధునిక భారత నిర్మాత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ అని మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్ అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి మండల పార్టీ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య లతో కలిసి చైర్మన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ 18 ఏళ్లకు ఓటు హక్కు కల్పించి, యువతకు భారత నిర్మాణంలో భాగస్వామ్యం చేశారన్నారు. నాడు విశ్వవిద్యాలయాల్లో, కళాశాలల్లో కంప్యూటర్ లను అందజేసి సూపర్ కంప్యూటర్ ను దేశానికి తెచ్చిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మండ్లి రాములు, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు నాయకులు అవ్వారి శివలింగం, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కాలే మల్లయ్య, ఖాదర్ ఖాద్రి, అబ్దుల్ అలీమ్, కండె సాయి, అబ్దుల్ కరీం, ఐఎన్టీయుసి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, కొండల్ రెడ్డి, నాజర్, దేవరశెట్టి మహేష్, సురేష్, రఫీ, రాగ్య తదితరులు ఉన్నారు.

## ఘనంగా గోలీ శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు



**అమనగల్లు, మే 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మెన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అభిమానుల అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచాలు కాల్చి, కేకులు కట్ చేశారు. పూలమాల శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, కౌన్సిలర్లు సభ్యులు పాపిశెట్టి రాము, నాగిళ్ళ జగన్, ఏనుమల్ల రమేష్, దుడ్డు ఆంజనేయులు యాదవ్, అనూష శ్రీశైలం, ఎంగలి భాగ్యమ్మ రఘు, కాలే యశోదమ్మ, మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహా రెడ్డి, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్, గుత్తి బాలస్వామి, అనంతుల సైదులు గౌడ్, కమటం రాధామ్మ వెంకటయ్య, సర్పంచ్ సర్పంచ్ శ్రీను నాయక్, చలిచీమల సతీష్, వడ్డేమోని శివకుమార్, కొమ్ము ప్రసాద్, జంతుక కిరణ్, గుజ్జరి గోపి, సుమన్ నాయక్, కృష్ణ, వర్షిత్, గణేష్, శివ, కార్తీక్, జంగయ్య తదితరులు ఉన్నారు.

## రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి



**మిర్యాలగూడ,మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారత ఆధునిక సాంకేతిక విప్లవ పితామహుడు, మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి , ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ఘన నివాళి అర్పించారు.మొదట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రాజీవ్ భవన్లో ప్రజా ప్రతినిధులతో కలిసి నివాళులు అర్పించారు. పట్టణంలోని రాజీవ్ చౌక్ వద్ద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా స్మరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎల్ఆర్ మాట్లాడుతూ, “21వ శతాబ్దపు ఆధునిక భారత నిర్మాణానికి రాజీవ్ గాంధీ పునాది వేశారు. కంప్యూటర్, టెలికాం విప్లవాలు ఆయన దూరదృష్టి ఫలితం. యువతకు రాజకీయ భాగస్వామ్యం కల్పించేందుకు ఓటు హక్కు వయస్సును 21 నుండి 18 సంవత్సరాలకు తగ్గించారు. 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా గ్రామ స్వరాజ్యానికి నిజమైన రూపం ఇచ్చారు. దేశ సమగ్రత, శాంతి కోసం ఆయన చేసిన త్యాగం అమూల్యం” అని అన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కమిషనరేట్‌లో నెలవారీ
# నేర సమీక్ష సమావేశం




**కరీంనగర్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించి, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశించారు. గురువారం కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో ఆయన అధ్యక్షతన నెలవారీ నేర సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అధికారులు తమ పరిధిలోని పెండింగ్ కేసుల డైరీలను సమర్పించి, కేసుల పురోగతిని వివరించారు. సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ 2024 వరకు పెండింగ్‌లో ఉన్న పాత కేసులు, ఈ ఏడాది నమోదైన తీవ్రమైన నేరాల స్థితిగతులను సమీక్షించి, ఆస్తి సంబంధిత నేరాలు, మహిళలపై అఘాయిత్యాలు, పోక్సో చట్టం కింద నమోదైన కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద రెవెన్యూ అధికారులతో సమన్వయం చేయాలని, నగరంలో విజిబుల్ పోలీసింగ్ స్పష్టంగా కనిపించేలా రాత్రి--పగలు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని ఆదేశించారు. డయల్ 100 ద్వారా వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలని స్పష్టం చేశారు. రౌడీషీటర్లపై నిఘా ఉంచి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, హోటళ్లు--లాడ్జీలలో సరైన గుర్తింపు కార్డులు, ఫోన్ నంబర్లు సరిచూసుకున్న తర్వాతే గదులు అద్దెకు ఇవ్వాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నేపాలీ కార్మికుల వివరాలను పోలీస్ స్టేషన్ల వారీగా నమోదు చేయాలని, బ్యాంకులు--జ్యువెలరీ షోరూమ్‌లలో సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, నంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని, కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని, సైబర్ నేరాలపై విస్తృత ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. మహిళా పోలీస్ సిబ్బందికి బ్లూ కోల్ట్స్ విధులు కేటాయించాలని ఆదేశించారు. రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని పశువుల అక్రమ రవాణా జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, కమిషనరేట్ వ్యాప్తంగా మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ఇప్పటికే ఉన్న కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, వాటి జియో-ట్యాగింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్, వేణుగోపాల్, శ్రీనివాస్ జి, విజయకుమార్, వెంకటస్వామి, మాధవి, సతీష్, ప్రతాప్‌తో పాటు కమిషనరేట్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారం, విజిబుల్ పోలీసింగ్, సీసీ కెమెరాల నిఘా---కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన లక్ష్యాలుగా సీపీ గౌష్ ఆలం స్పష్టం చేశారు.

## ఇంధన ధరలు తగ్గించి, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని సిఐటియు నిరసన




**కరీంనగర్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా పబ్లిక్ ఽ ప్రైవేటు రోడ్డు ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో పెట్రోలు, డీజిల్, సిఎన్జి గ్యాస్ ధరలు తగ్గించాలని, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ చౌక్ గీత భవన్ చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, యూనియన్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గుతున్నా, కేంద్ర ప్రభుత్వం దేశంలో ఇంధన ధరలను పెంచి ప్రజలపై అదనపు భారం మోపుతోందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రజల జేబులు ఖాళీ చేస్తోందని అన్నారు. ఇటీవలి ఎన్నికల అనంతరం వరుసగా పెట్రోలు, డీజిల్ ధరలు పెంచడం వల్ల ఆటో, ట్రాలీ, క్యాబ్ డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి పెట్టుబడిదారుల కోసం నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయడం కార్మికుల పొట్ట కొడుతున్నదని గుర్తు చేశారు. వెంటనే ఈ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకం కారణంగా ఆటో డ్రైవర్లు గిరాకీ లేక ఇబ్బందులు పడుతున్నారని, పెరిగిన ఇంధన ధరలతో పరిస్థితి మరింత దయనీయంగా మారిందని తెలిపారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని, లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెలికాని శ్రీనివాస్, ఎండి షాబుద్దీన్, బోటుక ఐలేష్, కాల్వ కిషన్, ఉడి కందుల ఐలేష్, కొమురయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు. ఇంధన ధరలు తగ్గించి, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కార్మిక సంఘాలు స్పష్టం చేశాయి.

## ఘనంగా బడి బాట కార్యక్రమం



**గంగాధర, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని గట్టుబూత్కూర్ గ్రామంలో పీపీపీపీ -- ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, మదర్ కమిటీ సభ్యులతో అవగాహన సమావేశం జరిపి, అంగన్‌వాడీ కేంద్రాల నుండి ప్రీ ప్రైమరీ, ప్రైమరీ పాఠశాలలకు విద్యార్థులు సాఫీగా మారేలా చర్యలు తీసుకోవాలని, తల్లిదండ్రుల్లో బాధ్యతాభావం పెంపొందించాలని, ప్రతి చిన్నారి తప్పనిసరిగా పాఠశాలలో చేరి నిరంతర విద్యను కొనసాగించాలని సందేశం ఇచ్చారు. గ్రామంలో నిర్వహించిన అవగాహన ర్యాలీ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రీ ప్రైమరీ, ప్రైమరీ పాఠశాలల మధ్య బలమైన అనుసంధానం ఏర్పడేలా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఎనుగు ప్రభాకర్ రావు మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలు పట్టుకొమ్మల వంటివి. ప్రభుత్వ పాఠశాల ప్రవేశాలను పెంచుదాం. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యప్రకాశ్, చంద్రకళ, సిఆర్పి మధు, ముగ్గురు అంగన్‌వాడీ టీచర్లు, మదర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంపుతో విద్యార్థుల భవిష్యత్తు మరింత బలపడుతుందని అధికారులు స్పష్టం చేశారు.

## ఎస్‌టిపి నిర్మాణాలకు
# భూసేకరణ చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**



**నంద్యాల, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్య వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల (ఎస్‌టిపి) నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. గురువారం నందికొట్కూరు, ఆత్మకూరు మున్సిపాలిటీల అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ, "రైతుల సమ్మతితో నష్టపరిహార ప్రతిపాదనలను ఆమోదించి, భూసేకరణను పారదర్శకంగా పూర్తి చేయాలి" అని సూచించారు. నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 704లోని రెండు ఎకరాలు రైతు సమ్మతితో భూసేకరణ ప్రతిపాదనకు పంపాలని ఆదేశించారు. అలాగే ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 759లోని 1.50 ఎకరాలు రైతుతో చర్చించి రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. "పట్టణాల్లో శాశ్వత పారిశుద్ధ్య నిర్వహణ, కాలుష్య నియంత్రణ, ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా ఎస్‌టిపి నిర్మాణాలు అత్యంత కీలకం. రైతుల సహకారంతో పారదర్శకంగా భూసేకరణను ముందుకు తీసుకెళ్తున్నాం" అని కలెక్టర్ పేర్కొన్నారు.

## హెచ్‌ఆర్‌ఏ ఫైల్‌పై స్పందించిన అధికారులు



**కరీంనగర్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కరీంనగర్ నగర పరిధి నుండి 8 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలకు హెచ్‌ఆర్‌ఏ 17% పెంపుదల ఫైల్ ఇటీవల అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసుకుని కలెక్టర్ ఆమోదం కోసం వెళ్లింది. కలెక్టర్ అదనపు వివరాలను మున్సిపల్ కమిషనర్ ద్వారా పంపాలని ఆదేశించగా, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఏఆర్ బషీర్ మహమ్మద్ వెంటనే స్పందించారు. తపస్ జిల్లా అధ్యక్షుడు అన్నమనేని తిరుపతిరావు, జిల్లా మీడియా ఇన్‌చార్జ్ బొద్దుల సత్యనారాయణతో కలిసి అభ్యర్థించగా, ఆయన సూపరింటెండెంట్ సంజీవ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ శిరీషను పిలిపించి వివరాలు సిద్ధం చేయాలని సూచించారు. ఒకటి రెండు రోజుల్లో కలెక్టర్‌కు పంపేలా చర్యలు చేపట్టారు. సానుకూలంగా స్పందించిన డిసీపీఓ, సూపరింటెండెంట్ మరియు ఇతర అధికారులకు తపస్ జిల్లా శాఖ కృతజ్ఞతలు తెలిపింది. రైతు గ్రామాల కోసం హెచ్‌ఆర్‌ఏ పెంపుదల ఫైల్‌పై అధికారులు వేగంగా స్పందించడం ప్రశంసనీయమని తపస్ జిల్లా శాఖ పేర్కొంది.

## నంద్యాల నుంచి తిరుపతి భక్తులకు శుభవార్త



**నందికొట్కూరు, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల జిల్లా నుంచి తిరుపతి వైపు వెళ్ళే రైలు ప్రయాణికులకు, శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తులకు దక్షిణ మధ్య రైల్వే శాఖ శుభవార్త తెలిపింది. నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి గురువారం ప్రకటించిన వివరాల ప్రకారం, నంద్యాల మీదుగా తిరుపతికి సమ్మర్ స్పెషల్ వీక్లీ ట్రైన్ నడపనున్నారు. 17443 నెంబరు ట్రైన్ తిరుపతి నుంచి చర్లపల్లి వైపు కడప, ఎర్రగుంట్ల, నంద్యాల, నడికుడి మీదుగా మే 28న నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో 17444 నెంబరు ట్రైన్ చర్లపల్లి నుంచి నడికుడి, నంద్యాల, ఎర్రగుంట్ల, కడప మీదుగా మే 29న తిరుపతికి చేరుతుంది. ఈ ట్రైన్ తిరుపతి నుంచి సాయంత్రం 4:30 గంటలకు బయలుదేరి, రాత్రి 9:00 గంటలకు నంద్యాల చేరుకొని, మరుసటి రోజు ఉదయం 8:30కి చర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో చర్లపల్లి నుంచి సాయంత్రం 4:20కి బయలుదేరి, అర్ధరాత్రి 12:00కి నంద్యాల చేరుకొని, మరుసటి రోజు ఉదయం 7:30కి తిరుపతి చేరుతుంది. జిల్లా ప్రజలు, రైలు ప్రయాణికులు ఈ రైలును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ బైరెడ్డి శబరి కోరారు.

## జాగ్రత్తగా ఉండండి --
# ఆరోగ్యంగా ఉండండి

**- మున్సిపల్ కమిషనర్ వెంకటరామి రెడ్డి**



**నందికొట్కూరు, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ కుమారి గణియా ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి పట్టణ ప్రజలకు సూచించారు. "ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదు. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ లేదా గుడ్డతో తలను కప్పుకోవాలి. రోజుకు ఎక్కువగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలి. పలుచని, లేత రంగు పత్తి దుస్తులు ధరించాలి. చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఎండలో ఎక్కువసేపు ఉండకూడదు. ఎండలో పని చేసే వారు మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకోవాలి" అని ఆయన సూచించారు. తలనొప్పి, తల తిరగడం, అలసట, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే నీడలో విశ్రాంతి తీసుకుని వైద్యుడిని సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వాహనాలలో పిల్లలను ఒంటరిగా వదిలివేయకూడదని, పండ్లు మరియు తేలికపాటి ఆహారం తీసుకోవాలని, శరీరంలో నీటి లోపం రాకుండా తరచుగా నీరు త్రాగాలని సూచించారు.

## కొత్తగట్టు-గొల్లపల్లి
# సమస్య పరిష్కారం



**హుజురాబాద్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్--వరంగల్ నేషనల్ హైవే నిర్మాణం కారణంగా కొత్తగట్టు, గొల్లపల్లి గ్రామ ప్రజలకు ఎదురైన సమస్యను కేంద్రమంత్రి బండి సంజయ్ పరిష్కరించారు. గ్రామ ప్రజలు ఇటీవల ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేషనల్ హైవే అధికారులు సమస్య పరిష్కారం కోసం కొత్తగట్టు గ్రామంలో పెద్ద మోరి నిర్మాణం చేపట్టారు. రహదారికి ఇరువైపులా ర్యాంపులు ఏర్పాటు చేసే పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి స్థానిక బీజేపీ శ్రేణులతో కలిసి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సుధగోని శ్రీనివాస్ గౌడ్, బూత్ అధ్యక్షుడు బోడ అనిల్, ప్రధాన కార్యదర్శి తీగల శ్రావన్ కుమార్, సోషల్ మీడియా నాయకుడు చుక్క శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజల సమస్యపై వెంటనే స్పందించి పరిష్కారం చూపిన కేంద్రమంత్రి బండి సంజయ్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## విజిబుల్ క్లీన్‌లినెస్ లక్ష్యంగా కార్యాచరణ



**నందికొట్కూరు, మే 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల జిల్లా పరిధిలోని నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, డోన్, బేతంచర్ల మున్సిపాలిటీల్లో పరిశుభ్రతను మెరుగుపర్చేందుకు నాలుగు వారాల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. అమరావతి సచివాలయం నుంచి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రజా రద్దీ ప్రదేశాల్లో ఎరుపు--పసుపు మచ్చలు తొలగించి, రోడ్లు, డివైడర్లు, ఫుట్‌పాత్‌లకు పెయింటింగ్, డ్రైన్ల శుభ్రత, బల్క్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఆన్-సైట్ కంపోస్టింగ్, పబ్లిక్ టాయిలెట్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి" అని సూచించారు. వేసవికాలం దృష్ట్యా ప్రధాన కూడళ్లలో ఉచిత చలివేంద్రాలు ఏర్పాటు చేసి, భక్తులకు మంచినీరు, మజ్జిగ అందిస్తున్నామని తెలిపారు. అన్నప్రసాద భవనాల్లో శు చీశుభ్రత, తాజా కూరగాయల వినియోగం, రుచికరమైన వంటకాలు, ఆత్మీయ వడ్డనపై అధికారులు శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా ఉండి, చెత్త నిల్వ కేంద్రాలు, గార్బేజ్ పాయింట్లు, ఖాళీ స్థలాలను పూర్తిగా శుభ్రపరచాలని, చేపట్టిన పనులన్నింటినీ నివేదిక రూపంలో ప్రభుత్వానికి సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. "ముఖ్యమంత్రి పర్యటనలు, అధికారిక కార్యక్రమాల సమయంలో పరిశుభ్రత ప్రతిష్ఠాత్మకంగా కనిపించేలా చర్యలు ఉండాలి" అని స్పష్టం చేశారు.

## మిడ్తూరు దళితవాడలో ఉచిత వైద్య శిబిరం





**నందికొట్కూరు, మే 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మిడ్తూరు గ్రామ దళితవాడలో ఏర్పాటు చేసిన డాక్టర్ సుధాకర్ సంస్మరణ సభలో వైద్యులు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలపై అనేక దాడులు జరిగాయి. మాస్కులు అడిగినందుకు డాక్టర్ సుధాకర్ మానసిక వేధింపులకు గురై మరణించగా, అనంతబాబు డ్రైవర్ మృతదేహ ఘటనను దళిత సమాజం మరచిపోలేదు. ఓట్ల కోసం దళితుల పేరుతో రాజకీయాలు చేయడం హాస్యాస్పదం" అని వ్యాఖ్యానించారు. తరువాత సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మిడ్తూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. లిబోయ రంగన్న (?40,599), వడ్డే రంగస్వామి (?17,392), డీరెడ్డి మురళీధర్ రెడ్డి (?30,600), క్రైప చంద్ర పుల్లా రెడ్డి (?25,000), మిట్టమీద సాయిబాబా (?40,070), వడ్డే చిన్న యెల్లన్న (?55,686)లిలకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మిడ్తూరు మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, ప్రభుత్వ అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

## పనికి తగ్గట్టు కూలీలు ఇవ్వడం లేదని ఆందోళన



**నందికొట్కూరు, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పగిడ్యాల గ్రామ ఉపాధి కూలీలు గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. "ఆరు రోజులు పని చేసినా, టెక్నికల్ అసిస్టెంట్ మూడు రోజులకు మాత్రమే హాజరు తీసుకొని వేతనం చెల్లిస్తున్నాడు. కొన్ని గ్రూపులు పనికి పోకపోయినా హాజరు వేస్తున్నాడు" అని కూలీలు ఆరోపించారు. కూలీల పట్ల దురుసుగా వ్యవహరిస్తూ, తనకు అనుకూలమైన గ్రూపులకు ఎక్కువ వేతనం వేస్తున్నాడని వారు మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తరువాత ఏపీఓ మద్దిలేటి వినతిపత్రం స్వీకరించి, "టెక్నికల్ అసిస్టెంట్‌పై విచారణ జరిపి కూలీలకు న్యాయం చేస్తాం. ఇకపై ఇలాంటి సమస్యలు జరగకుండా చర్యలు తీసుకుంటాం" అని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెరిగి అధిక దిగుబడులు



**ఎలిగేడు, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రైతులు తమ పంట పొలాల్లో పచ్చిరొట్ట ఎరువులు జనుము, జీలుగులను వేసి కొద్ది రోజుల తర్వాత కలియదున్నితే అవి సేంద్రీయ ఎరువులుగా మారి భూసారం పెరిగి పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ తెలిపారు. ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామంలో జీపీ కార్యాలయం ఆవరణలో కృషి విజ్ఞాన కేంద్రం రామగిరిఖిల్లా, ఎలిగేడు వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో సమతుల్య ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతులకు స్థూల పోషకాలు నత్రజని, భాస్వరం, పోటాష్ వినియోగం, వాటి దశల వారీ ప్రాముఖ్యతను వివరించారు. భూసార పరీక్ష విధానాన్ని ప్రత్యక్షంగా చూపించి, ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నామని, కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అలాగే ఆయిల్ పామ్ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని, వరి కోయలను కాల్చకుండా నీళ్లలోనే కలియదున్నాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లెర్ల వెంకటేష్ గౌడ్, సింగిల్ విండో చైర్మన్ గోపు విజయభాస్కర్ రెడ్డి, ఏఈఓ గణేష్, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ అభిలాష్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## నిజమైన ఉద్యమకారులను గుర్తించాలి



**అంబర్పేట్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన నిజమైన ఉద్యమకారులను గుర్తించాలని కోరుతూ అంబర్పేట్ జేఏసీ కన్వీనర్ రూబీ స్టీవెన్సన్ నేతృత్వంలో ఉద్యమకారులు గురువారం డిప్యూటీ తాసిల్దార్ బలరాంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కేకే కమిటీ పార్టీలు, కులమతాలకు అతీతంగా నిజమైన ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వాలి. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉద్యమంలో పాల్గొన్న వారి వివరాలు సేకరించి, అందరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలి" అని సూచించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్టు ఉద్యమకారులకు 250 గజాల స్థలం, ?25 వేల పెన్షన్, హెల్త్ కార్డు, గుర్తింపు పత్రాలు ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారులు వర్కాల శ్రీకాంత్, రవీందర్, భాను దాస్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద ఘటనా స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే




**పదర, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పదర మండల పరిధిలోని మద్దిమడుగు గ్రామంలో గురువారం ఉదయం 3 గంటల సమయంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనా స్థలాన్ని గురువారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సందర్శించారు. కాలి బూడిదైన దుకాణాలను పరిశీలించి, నష్టపోయిన కుటుంబాల పరిస్థితిని ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. బాధితులకు వెంటనే తగిన సహాయం, పరిహారం అందించేందుకు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రభుత్వం తరపున బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం" అని హామీ ఇచ్చారు. అనంతరం టిపిసిసి ఉపాధ్యక్షులు, డిసిసి అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల ఆర్థిక సహాయం



**వంగూరు, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వంగూరు మండల కేంద్రానికి చెందిన బండపల్లి వెంకటయ్య కుమారుడు ఇటీవల మరణించడంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదేశాల మేరకు గురువారం కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబానికి రూ. 5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, జిల్లా నాయకులు జయ ప్రసాద్ రావు, టౌన్ ప్రెసిడెంట్ గాఫుర్, మండల నాయకులు నరేందర్ గౌడ్, సైదులు, కృష్ణ, జనార్ధన్, నందు, వెంకట్ గౌడ్, చంద్రశేఖర్, రామస్వామి, కృష్ణయ్య, రమేష్, సతీష్ పాల్గొన్నారు.

## ఎక్సైజ్ శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే గిత్త



**నందికొట్కూరు, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గురువారం కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, నందికొట్కూరు టిడిపి ఇన్‌చార్జి గౌరు వెంకట్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. తరువాత నందికొట్కూరు నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలపై ఎమ్మెల్యే గిత్త జయసూర్య మంత్రితో చర్చించారు.

## పెన్షన్ దారులకు ఇంటి వద్దనే ఈకేవైసీ



ఇంటి వద్దనే ఈకేవైసీ ప్రక్రియ
నిర్వహిస్తున్న సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్

**ఎలిగేడు, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చేయుత పథకం ద్వారా పెన్షన్ పొందుతున్న లబ్ధిదారుల కోసం ఎలిగేడు మండలం ర్యాకల్దేవుపల్లిలో ఈకేవైసీ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి--సంపత్, పంచాయతీ కార్యదర్శి కె. అశోక్ ఆధ్వర్యంలో అధికారులు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి ఫేస్ రికగ్నిషన్ ద్వారా ఈకేవైసీ చేస్తున్నారు. వేసవి ఎండల్లో లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా స్వయంగా వారి ఇళ్ల వద్దకే వెళ్లి ఈకేవైసీ నిర్వహిస్తున్నామని సర్పంచ్ తెలిపారు. "జూన్ 15లోపు ప్రతి పెన్షన్ లబ్ధిదారు తప్పనిసరిగా ఈకేవైసీ పూర్తి చేయాలి" అని స్పష్టం చేశారు.

## బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



**ఎలిగేడు, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బడిబాట కార్యక్రమం సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం దేవేందర్ రావు మాట్లాడుతూ, "ఐదేళ్లు దాటిన బడీడు పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి. గ్రామంలో ఐదేళ్లు లోపు పిల్లల వివరాలను నమోదు చేసి, వారి పూర్తి వివరాలను ప్రాథమిక పాఠశాల హెచ్ఎంలకు అందజేయాలి" అని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, పదవ తరగతి ఫలితాల విజయవంతమైన తీరును తల్లిదండ్రులకు వివరించారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను మదర్స్ కమిటీ సభ్యులు ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జ్ఞానేశ్వర్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, అరుణ కుమారి, ఉమా, శ్రీనివాస్, అంగన్వాడి టీచర్లు జ్యోతి, సరోజ, మదర్స్ కమిటీ సభ్యులు, ప్రీ ప్రైమరీ టీచర్లు పాల్గొన్నారు.

## ఘనంగా రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ పుట్టినరోజు వేడుకలు



**వెల్దండ, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు పుట్ట రామ్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, మాజీ సర్పంచ్ అరుణ ప్రభాకర్, మాజీ ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్, మాజీ మండల అధ్యక్షుడు కానుగుల జోగయ్య, మాజీ ఎంపీటీసీ లింగం, సర్పంచ్ కొండల్ యాదవ్, నాగుల్ నాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగయ్య, పోలే అశోక్, జంగిలి యాదగిరి, జంగిలి ఆనంద్, జంగిలి ప్రసాద్, జంగిలి ప్రవీణ్, తుంగ శీను, టైలర్ వెంకటయ్య, జంగిలి శ్రీనివాస్, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

# మద్దిమడుగు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అగ్నిప్రమాదం

## - ఐదు దుకాణాలు దగ్ధం




**అమ్రాబాద్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం మద్దిమడుగు గ్రామంలోని శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో సోమవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన అగ్నిప్రమాదంలో ఐదు దుకాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న అచ్చంపేట ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మంగళవారం ఉదయం సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. గౌస్, సందీప్, శ్రీను, వెంకటేష్, మల్లేష్ అనే ఐదుగురు బాధితులను పరామర్శించి వారికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వెంటనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి బాధితులను త్వరితగతిన ఆదుకోవాలని కోరారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే స్పందించి పరామర్శించినందుకు ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, దేవస్థాన కమిటీ చైర్మన్ రాములు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత మల్లేష్, అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. మద్దిమడుగు అగ్నిప్రమాదం బాధితులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆర్థిక సాయం అందజేయడం స్థానికులకు ధైర్యం కలిగించింది.

## రైతుల పొలాల్లో అకస్మాత్తుగా చెలరేగిన మంటలు



**తిమ్మాపూర్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రేణికుంట గ్రామ పరిధిలోని రైతుల పొలాల్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. సమాచారం అందగానే గ్రామ సర్పంచ్ ఎలుక ఆంజనేయులు వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. తక్షణమే ఫైర్ ఇంజన్ సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు మరింత వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి అదుపులోకి తీసుకువచ్చారు. ఈ చర్యలతో రైతులకు పెద్ద నష్టం తప్పింది. గ్రామ ప్రజలు కూడా సహకరించి మంటలను అదుపు చేయడంలో సహాయం చేశారు. వేగంగా స్పందించిన ఫైర్ సిబ్బందికి, సర్పంచ్ ఎలుక ఆంజనేయులకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. సమయానుకూల చర్యలతో పెద్ద ప్రమాదం తప్పింది.

## తూప్రాన్ హైవేపై లారీ దగ్ధం




**తూప్రాన్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నిజామాబాద్ వైపు నుండి హైదరాబాద్ వైపు వస్తున్న కంటైనర్ లారీ తూప్రాన్ మండలం నాగులపల్లి బ్రిడ్జి వద్దకు రాగానే ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దాంతో లారీలో ఉన్న ఎనిమిది కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. అక్కడ ఉన్న స్థానికులు వెంటనే ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించగా, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు కానీ భారీ ఎత్తున ఆస్తి నష్టం జరిగినట్టు సమాచారం. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. తూప్రాన్ హైవేపై జరిగిన ఈ ఘటన స్థానికులను కలవరపరిచింది.

## జిల్లా ఇన్‌చార్జ్‌గా సలేంద్ర కోమురయ్య యాదవ్



**పెద్దపల్లి, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుంట్ల కవిత నాయకత్వంలోని తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న "జెండా పండుగ" కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జ్‌గా సలేంద్ర కొమురయ్య యాదవ్‌ను పార్టీ రాష్ట్ర నాయకత్వం నియమించింది. ఈ నెల 20వ తేదీ నుంచి వచ్చే నెల వరకు రాష్ట్రంలోని 33 జిల్లాలు, 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జెండా పండుగ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమం విజయవంతం కోసం జిల్లా, నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినందుకు సలేంద్ర కొమురయ్య యాదవ్ కవితకు కృతజ్ఞతలు తెలుపుతూ, గ్రామ గ్రామాన పార్టీ జెండా ఎగరవేసి ఉద్యమకారులు, నాయకులతో సమన్వయం చేసుకుంటూ పార్టీని బలోపేతం చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, నియోజకవర్గ నాయకులకు ధన్యవాదాలు తెలియజేస్తూ, జెండా పండుగను విజయవంతం చేయడానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా జెండా పండుగను ఘనంగా నిర్వహించేందుకు సలేంద్ర కొమురయ్య యాదవ్ సన్నద్ధమవుతున్నారు.

## ఘనంగా శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో సువర్ణప్రాశనం యజ్ఞం



**కరీంనగర్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో వైశాఖ పుష్యమి నక్షత్రం సందర్భంగా సువర్ణప్రాశనం మరియు యజ్ఞం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నా రెడ్డి, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పులల శ్యామ్ పాల్గొనగా శంకర్ ఆర్యన్ యజ్ఞం గావించారు. సువర్ణప్రాశనం ఆరు నెలల చిన్నారుల నుండి 14 సంవత్సరాల పిల్లలు వరకు తీసుకోవచ్చని, ఇది మేధస్సు, జ్ఞాపకశక్తి పెంపుతో పాటు శారీరక బలం, రోగనిరోధక శక్తిని పెంచుతుందని, తరచుగా వచ్చే ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తుందని కోల అన్నా రెడ్డి తెలిపారు. చురుకుదనం, జీర్ణక్రియ, ఆకలి పెంపునకు కూడా ఇది సహకరిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గట్టు శ్రీనివాస్, కొత్తూరి ముకుందం, గట్టు రాంప్రసాద్, నడిపెల్లి దీన్ దయాల్ రావు, అప్పిడి వకుళ దేవి, డాక్టర్ చక్రవర్తుల రమణ చారి, ఎలగందుల సత్యనారాయణ, మేచినేని దేవేందర్ రావు, రాపర్తి శ్రీనివాస్, తాటి రాజేశ్వర్ రావు, తణుకు మహేష్, పోలు సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సువర్ణప్రాశనం యజ్ఞం ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో కె. మహేశ్వర్, డీఎస్ఓ నర్సింగరావు



**గంగాధర, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్డీవో కె. మహేశ్వర్, డీఎస్ఓ నర్సింగరావు పరిశీలించారు. తహసీల్దార్ రజిత, ఎంపీడీఓ దమ్మని రాము, సీఐ ప్రదీప్ కుమార్, ఎస్ఐ వంశీ కృష్ణ, ఐకేపీ ఏపీఎం కుమార్, పిఎసిఎస్ సీఈఓలు పాల్గొన్న సమావేశంలో కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యలపై తహసీల్దార్ కార్యాలయంలో చర్చించారు. అనంతరం ఏఎంసీ మార్కెట్ యార్డ్‌లోని గోదాంలను పరిశీలించి తాత్కాలికంగా ధాన్యం నిల్వ చేయడానికి ఏర్పాట్లు చూశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని, రైతుల వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేయాలని, లారీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఏపీఎం, పిఎసిఎస్ సీఈఓలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిశీలనలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, మార్కెట్ యార్డ్ కార్యదర్శి శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. రైతుల ఇబ్బందులు తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు.

## ఫిట్ ఇండియా నినాదం స్ఫూర్తితో ఓపెన్ జిమ్ ప్రారంభం



**కరీంనగర్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫిట్ ఇండియా నినాదం స్ఫూర్తిగా, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో మలయప్ప ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధుల ద్వారా కరీంనగర్ నగరంలోని 24వ డివిజన్‌లో ఓపెన్ జిమ్‌ను గురువారం ప్రారంభించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ జిమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, 24వ డివిజన్ కార్పొరేటర్ ఒంటెల సత్యనారాయణ రెడ్డి, 22వ డివిజన్ కార్పొరేటర్ బండ రమణారెడ్డి, పాలకవర్గ సభ్యులు, వాకర్స్, స్థానిక ప్రజలు, మహిళలు పాల్గొన్నారు. ఫిట్ ఇండియా లక్ష్యంతో కరీంనగర్ ప్రజలకు ఆరోగ్య సదుపాయాలు మరింత చేరువ అవుతున్నాయి.

## 49వ డివిజన్‌లో పెన్షన్ అప్‌గ్రేడేషన్ ప్రకియ ప్రారంభం



**కరీంనగర్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నగరంలోని 49వ డివిజన్ ప్రజల పెన్షన్ అప్‌గ్రేడేషన్ ప్రక్రియ గురువారం అధికారికంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్‌గ్రేడేషన్ ప్రక్రియ జూన్ 15 వరకు కొనసాగుతుందని తెలిపారు. లబ్ధిదారులు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్పొరేటర్ కార్యాలయం లేదా సనాతన ధర్మ సేవా సమితి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీని వార్డు ఆఫీసర్‌కు సమర్పించి అప్‌గ్రేడ్ చేయించుకోవాలని కోరారు. మొదటి రోజు జరిగిన కార్యక్రమంలో దాదాపు 100 మంది లబ్ధిదారులు పాల్గొనగా, వార్డు ఆఫీసర్ మండే శిరీష వారి వివరాలను అప్‌డేట్ చేశారు. ఈ కార్యక్రమంలో లంబు సుధాకర్ రెడ్డి, గాధగోని రమేష్, ఉమారాణి, విజయ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పెన్షన్ లబ్ధిదారుల సౌకర్యార్థం అప్‌గ్రేడేషన్ ప్రక్రియ ప్రారంభమైంది.

## గన్నేరువరంలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ



**గన్నేరువరం, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** గన్నేరువరం మండలం కాజీపేట గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై గ్రామస్తులు జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేయడంతో ఎంపీడీవో శ్రీనివాస్ గురువారం విచారణ చేపట్టారు. ఉపాధి హామీ కూలీలను ప్రత్యక్షంగా విచారించి పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ విచారణ వివరాలను ఉన్నతాధికారులకు అందజేసి వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదుతో ప్రారంభమైన ఈ విచారణపై అధికారులు తగిన చర్యలు తీసుకోనున్నారు.

## గంటన్నరలోనే చైన్ స్నాచర్ అరెస్ట్



**హుస్నాబాద్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పెన్షన్ ఇప్పిస్తానని మోసం చేసి వృద్ధురాలి మెడలోని రెండున్నర తులాల బంగారు చైన్ ఎత్తుకెళ్లిన నిందితుడు అల్లెపు కృష్ణను హుస్నాబాద్ పోలీసులు కేవలం గంటన్నరలోనే పట్టుకుని తమ ప్రతిభను మరోసారి చాటుకున్నారు. ఏసీపీ ఎస్. సదానందం వెల్లడించిన వివరాల ప్రకారం, నిందితుడు ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో 86 దోపిడి కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. వృద్ధురాలు ఐలేని లక్ష్మిని మాయమాటలతో నమ్మించి చైన్ తీసుకుని పరారైన అతడిని, సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా పోలీసులు గుర్తించారు. తంగళ్లపల్లి కేసులో ఇదే నిందితుడు ఉన్నాడని గుర్తించిన ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి అనుమానం వ్యక్తం చేయడంతో, సీసీఎస్ ఇన్స్పెక్టర్ పెండ్యాల దేవేందర్ బృందం నిఘా ఏర్పాటు చేసి గంటన్నరలోనే బస్టాండ్ వద్ద అతడిని అదుపులోకి తీసుకుంది. ఈ కేసును వేగంగా ఛేదించిన సీసీఎస్ ఇన్స్పెక్టర్లు పెండ్యాల దేవేందర్, రవీందర్, ఎస్ఐ తిరుపతి, హుస్నాబాద్ ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు యాదగిరి, నాగేష్, కానిస్టేబుల్ నరేష్‌లను సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. పోలీసులు ప్రజలకు సూచిస్తూ, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని, ప్రతి ఇంటి, వ్యాపార సంస్థల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. 86 కేసుల్లో నిందితుడైన అల్లెపు కృష్ణ అరెస్టుతో హుస్నాబాద్‌లో కలకలం రేపింది.

# ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి



**బోడుప్పల్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది.బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డిసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, డాక్టర్ రాపోలు రాములు, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, సర్కిల్ వర్కింగ్ ప్రెసిడెంట్ హరినాథ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు గుర్రాల రామ వెంకటేష్ యాదవ్, సింగిరెడ్డి పద్మా రెడ్డి, సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలు, ప్రజాసంక్షేమ పథకాలను స్మరించుకున్నారు.

# కొనసాగుతున్న సెంట్రింగ్ కార్మికుల రిలే నిరాహార దీక్ష



**మల్లాపూర్/నాచారం, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సెంట్రింగ్ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం మల్లాపూర్ చౌరస్తాలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ నెల 16వ తేదీ నుండి రిలే నిరాహార దీక్ష కొనసాగుతోంది.కార్మికులు "సున్నా ఫిట్ నుండి పది ఫిట్ల ఎత్తు వరకు జాక్ సెంట్రింగ్ పాత రేటు రూ.40ను కొత్తగా రూ.51కు పెంచాలి" అని డిమాండ్ చేశారు. అదేవిధంగా భవన నిర్మాణ కార్మికులకు శాశ్వత ఐడి కార్డులు, ఈఎస్ఐ వైద్య సదుపాయాలు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

# కాంగ్రెస్ హయాంలోనే అన్నివర్గాలకు సాయం

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**




**ఆమనగల్లు, మే 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అన్ని వర్గాలకు సీఎం సహాయనిధి సక్రమంగా అందుతోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు గురువారం ఎమ్మెల్యే నారాయణరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయనిధి ఒక గొప్ప అండగా నిలుస్తోందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎం సహాయనిధి చెక్కులు కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులకు సంబంధించిన వారికే మంజూరు చేసేవారని ఆరోపించారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, అమనగల్లు 10వ వార్డు కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, మేడిగడ్డ తండా ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు గౌడ్, కడ్తాల్ మండల పార్టీ అధ్యక్షుడు బిచ్యా నాయక్, వెంకటరెడ్డి, సురేందర్ రెడ్డి, యాదయ్య తదితరులు ఉన్నారు.

# ఘనంగా ఫుడ్ కమిషన్ చైర్మన్ జన్మదిన వేడుకలు



**తలకొండపల్లి, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తలకొండపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ప్రత్యేకంగా తయారు చేసిన కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి రోగులకు అరటి పండ్లను పంపిణీ చేశారు.కార్యక్రమంలో సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, బారాస మండల అధ్యక్షుడు కుమ్మరి శంకర్, ఏఎంసి మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మండుతున్న ఎండలు.. రైతులకు మజ్జిగ నీళ్ల పంపిణీ



**ఆమనగల్లు, మే 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రైతుల ఆరోగ్యం దెబ్బతిన్నకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కు వచ్చే రైతులకు గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ లను గురువారం పంపిణీ చేశారు. ఎండ తీవ్రత బాగా ఉన్నందున రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా రైతన్నలు మధ్య దళారులను ఆశ్రయించకుండా నేరుగా ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఆమనగల్లు మార్కెట్ యార్డ్ ఆవరణలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువచ్చి ధాన్యాన్ని అమ్ముకోవచ్చని తా కోరారు. రైతులెవ్వరు అధైర్య పడొద్దు చివరి గింజ వరకు వరి ధాన్యాన్ని కొనుగోలుకు ప్రాథమిక సహకార సిబ్బంది సిద్ధంగా ఉన్నారని గుర్తు చేశారు. రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని దీనితోపాటు సన్న రకం వడ్లకు రూ. 500 బోనస్ ప్రభుత్వం చెల్లిస్తుందని ఆయన వివరించారు. మార్కెట్ యార్డ్ ఆవరణలో రైతుల కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరిగిందని మరోసారి ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో వైస్ చైర్మెన్ ధోనాదుల సత్యం, ఆమనగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, దుడ్డు ఆంజనేయులు, ఎనుముల రమేష్, ఎంగలి భాగ్యలక్ష్మి రఘు, నాగిళ్ల జగన్, అనూష శ్రీశైలం, రామ్ నుంతల సర్పంచ్ శ్రీను నాయక్, మాజీ ఎంపీటీసీ లచ్చిరాం నాయక్, బిఆర్ఎస్ నాయకులు సయ్యద్ ఖలీల్, సైదులు గౌడ్, పాండు, వేణు, ఏఈవోలు మీనాక్షి భూదేవి, సింగల్ విండో సీఈఓ లు పద్మాకర్ రెడ్డి దేవేందర్ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో మైక్రోసాఫ్ట్ భారీ డేటా సెంటర్

**- ఈ ఏడాదిలోనే ప్రారంభం!**




**షాద్‌నగర్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దక్షిణ భారత ఐటీ హబ్ హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న భారీ డేటా సెంటర్ ఈ ఏడాదిలోనే ప్రారంభం కానుందని మైక్రోసాఫ్ట్ ఇండియా అధ్యక్షుడు పునీత్ చందోక్ వెల్లడించారు.దేశీయంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ సేవలకు విపరీతమైన డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భారత్‌లో మైక్రోసాఫ్ట్ అందిస్తున్న అజూర్ క్లౌడ్ సర్వీసెస్, కోపైలెట్ 365 ఏఐ అసిస్టెంట్లు మార్కెట్లో మంచి ఆదరణ పొందుతున్నాయని పేర్కొన్నారు.గతేడాది చివరిలో మైక్రోసాఫ్ట్ రూ.1.45 లక్షల కోట్ల భారీ పెట్టుబడి ప్లాన్‌ను ప్రకటించింది. ఇందులో అధిక మొత్తం హైదరాబాద్ డేటా సెంటర్ల విస్తరణకే కేటాయించనుంది. ఇప్పటికే పుణె, చెన్నై, ముంబయిలలో డేటా సెంటర్లు ఉన్నప్పటికీ, హైదరాబాద్‌లో నిర్మిస్తున్న సముదాయం అన్నింటికన్నా అతి పెద్దదిగా నిలవనుంది.షాద్‌నగర్ పరిసరాల్లో 41 ఎకరాలు, మేకగూడలో 22 ఎకరాలు, చందన్‌వెల్లిలో 53 ఎకరాల స్థలంలో డేటా సెంటర్లు నిర్మిస్తున్నారు. కొత్తూర్, నందిగామ ప్రాంతాల్లో కూడా స్థలాలు కొనుగోలు చేసినట్లు సమాచారం.డిజిటల్ వ్యక్తిగత డేటా రక్షణ చట్టం ప్రకారం వినియోగదారుల డేటాను స్థానిక సర్వర్లలోనే భద్రపరచడం తప్పనిసరి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఈ భారీ డేటా సెంటర్ కీలకంగా మారనుంది. గూగుల్, అమెజాన్ వంటి సంస్థల పోటీ ఉన్నప్పటికీ, మౌలిక వసతుల కల్పనలో తాము ముందున్నామని పునీత్ ధీమా వ్యక్తం చేశారు.ప్రస్తుతం దేశవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్‌లో 22,000 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఏఐ విప్లవానికి భారత్ సారథ్యం వహిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. టీసీఎస్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్ వంటి దేశీయ ఐటీ సంస్థలు ఇప్పటికే మైక్రోసాఫ్ట్ ఏఐ సేవలను భారీ స్థాయిలో వినియోగిస్తున్నాయి.

# గ్రామ అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదు

**-తలకొండపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం**



**తలకొండపల్లి, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తలకొండపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సర్పంచ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కటికల శేఖర్ యాదవ్ స్పష్టం చేశారు.మండల కేంద్రంలోని 4వ వార్డులో హాస్టల్ గోడ నుండి గ్రంథాలయం మెయిన్ రోడ్డు వరకు అండర్ డ్రైనేజీ పనులను పూర్తి చేయడంతో కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా శేఖర్ యాదవ్ మాట్లాడుతూ, "గ్రామపంచాయతీ పరిధిలో దశల వారీగా అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. నిజాయితీతో పనిచేసే నాయకత్వం, అభివృద్ధి పథంలో మన తలకొండపల్లి ముందుకు సాగుతుంది" అని అన్నారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు



**మర్రిగూడ, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా మర్రిగూడ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ మాట్లాడుతూ, "దేశ సమగ్రత, శాంతి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానాయకుడు రాజీవ్ గాంధీ. సమైక్యతే మన శక్తి, శాంతియుత భారతమే మన లక్ష్యం" అని అన్నారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నీలిమ చంద్రశేఖర్, గ్రామ శాఖ అధ్యక్షుడు పొనుగోటి శేఖర్ మాల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల్వాయి అనిల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి మేతరి యాదయ్య, రమావత్ శ్రీను నాయక్, వెంకటంపేట బాలయ్య, పగడాల లింగయ్య, సత్తిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు కోడాల వెంకట్ రెడ్డి, సిరిసవాడ బిక్షం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

**- గంప వెంకటేష్**



**కడ్తాల్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహిళలు తమకు నచ్చిన రంగాలలో రాణిస్తూ స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా సూచించారు.కడ్తాల్ పట్టణంలోని కమ్యూనిటీ హాల్‌లో మహిళలకు బ్యూటీ పార్లర్ శిక్షణ కార్యక్రమం 90 రోజులపాటు నిర్వహిస్తున్నారు. ట్రైనర్ ఆఫ్రిన్ బేగం ఆధ్వర్యంలో తరగతులు కొనసాగుతున్నాయి. దీనికిగాను అవసరమైన క్రీములు, పరికరాల కోసం రూ.10,000లను గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేశారు.ఈ సందర్భంగా వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి శిక్షణ శిబిరాలు మహిళలకు ఎంతో ఉపయోగపడతాయి. స్వయం ఉపాధి ద్వారా వారు ఆర్థికంగా ఎదగాలి" అని అన్నారు. శిక్షణ పొందుతున్న మహిళలను, ట్రైనర్‌ను అభినందించారు.కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ, బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాండు నాయక్, సురేష్, మహిళలు రజిత, సౌజన్య, లక్ష్మి, లహరి, సుల్తానా, సింధు, దివ్య, పావని, భార్గవి, శశి, ఇతరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన బి. రాంబాబు




**మర్రిగూడ, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మిర్యాలగూడ టూ టౌన్ ఎస్సైగా పనిచేసిన బి. రాంబాబు గురువారం మర్రిగూడ పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మిర్యాలగూడ లాంటి కీలక ప్రాంతంలో పనిచేసిన అనుభవం ఆధారంగా మర్రిగూడ పరిధిలో నేరాల నియంత్రణ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను మరింత మెరుగుపరుస్తాను. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతూ ప్రజల రక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తాను" అని అన్నారు.పలువురు నాయకులు ఎస్సై రాంబాబును శాలువాలతో సత్కరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై మునగాల కృష్ణారెడ్డిను వి.ఆర్.కు అటాచ్ చేశారు.

# యాచారం లో రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం

**యాచారం ,మే 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )**

భారతరత్న మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 35 వర్ధంతి సందర్భంగా యాచారం మండల కేంద్రంలో ఉన్న ఆ మహనీయుడి విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంధ్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోటే శ్రీశైలం రాజీవ్ గాంధీ విగ్రానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసి పల్లెల్లో వెలుగులు నింపి అభివృద్ధి బాటలు వేసినది, 18 సంవత్సరాలకే ఓటు హక్కును కల్పించి యువతను ప్రోత్సహించినది రాజీవ్ గాంధీ అని తెలిపారు. దేశానికి సాంకేతికతను పరిచయం చేసి ప్రపంచంలో గుర్తింపు తెచ్చిన మహనీయుడు రాజీవ్ అని కొనియాడారు. దేశంలో సాంకేతికతను తీసుకొచ్చిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చారని తెలిపారు. సరళీకృత విధానాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ అని అన్నారు. సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ కల సాకారమైందని అన్నారు. తెలంగాణకు గాంధీ కుటుంబంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. అది కుటుంబ సంబంధం కంటే ఎక్కువని తెలిపారు. తెలంగాణ ఉన్నంత వరకు ప్రజలు రాజీవ్ గాంధీ కుటుంబాన్ని గుర్తు చేసుకుంటారని అన్నారు.

ఈ కార్యక్రమంలో చౌదర్ పల్లి గ్రామ సర్పంచ్ కేశమోని రాజు గౌడ్ , నల్లవెల్లి గ్రామ సర్పంచ్ కిషన్ నాయక్, నానక్ నగర్ గ్రామ సర్పంచ్ సంగం చైతన్య రాజు, తక్కలపల్లి గ్రామ సర్పంచ్ నరేందర్ రెడ్డి, గడ్డ మల్లయ్య గూడ సర్పంచ్ అచ్చన మంగ జంగయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మస్క నరసింహ, గులాం అక్బర్, యూత్ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పోలమోని రామకృష్ణ, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పాశం జయప్రకాష్,మదర్ డెయిరీ డైరెక్టర్ మండలి జంగయ్య , లిక్కి పాండు రంగారెడ్డి , కొమ్ము విష్ణు,ఉప సర్పంచులు మధుకర్ రెడ్డి, శ్రీకాంత్,గ్రామ శాఖ అధ్యక్షులు రాజిరెడ్డి, కానమోని జంగయ్య, రాజేందర్ రెడ్డి, పంది అంజి,నీలం రాములు, మస్కు కుమార్, గౌర శ్రీశైలం,కేషమోని బుచ్చయ్య,బుగ్గరాములు,మొతకాని శ్రీకాంత్,బన్నె జంగయ్య, రావుల మహేందర్,పర్వతాలు, బీరప్ప,బేత జంగయ్య, సంగెం మల్లేష్, కలకొండ మల్లేష్, మోటే మహేష్, ఎరుకలి చింటు, కిన్నెర నాగరాజు, సంఘం మధు, పృథ్వీరాజ్, అనిల్, శివశంకర్, అర్జున్, రాకేష్, శివ, ఆడాల శివ , తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సాయి అన్నదాన భవనంలో మహా అన్నప్రసాద వితరణ





**కరీంనగర్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సాయినగర్‌లోని శ్రీ విజయ గణపతి సాయిబాబా దేవాలయం మొదటి అంతస్తులో నిర్మించిన శ్రీ సాయి అన్నదాన భవనంలో ప్రతి గురువారం, ప్రతి పౌర్ణమి, పర్వదినాల్లో మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతోంది.దాతలు, సాయి భక్తుల సహకారంతో ఈ సేవా కార్యక్రమం కొనసాగుతోందని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, అధ్యక్షుడు చిట్టుమల్ల కొండయ్య, ధర్మకర్తలు నలువాల ప్రకాష్ పటేల్, అముదాల లక్ష్మయ్య తెలిపారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి మారుతి మాట్లాడుతూ, "ప్రతి గురువారం 800--1000 మంది భక్తులకు మహా అన్నప్రసాదం అందిస్తున్నాం" అని వివరించారు.ఈరోజు మహా అన్నప్రసాద దాత కట్కూరి చంద్రశేఖర్--శరణ్య దంపతులను శేష వస్త్రంతో, సాయినాథ విగ్రహంతో సన్మానించారు.కార్యక్రమంలో కమిటీ సభ్యులు నలుమాచు చంద్రశేఖర్, రామిడి శ్రీధర్, విశ్వనాథుల శ్రీనివాస్, ప్రధాన అర్చకులు సాయి శర్మ, ఇతరులు గంగన్న, మూర్తి, మహేందర్, రఘు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఇబ్రహింపట్నం లో భారతరత్న, మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి



**రంగారెడ్డి జిల్లా , మే 21( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: ఇబ్రహీంపట్నం మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావణమోని లింగం ముదిరాజ్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధ్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గుర్నాథ్ రెడ్డి , మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మంకాల కర్ణాకర్ , PACS చైర్మన్ పాండురంగ రెడ్డి , కాంగ్రెస్ సీనియర్ నాయకులు తల కృష్ణ గౌడ్, ఇబ్రహీంపట్నం మున్సిపల్ అధ్యక్షులు గౌస్ పాషా, కౌన్సిలర్స్ భాను , రాఘవేందర్ శ్రీనివాస్ , తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మరియు మంచాల మాజీ వీూ జయమ్మ, కొంగర డివిజన్ అధ్యక్షులు చెన్న మౌని రమేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు
# స్పీడ్ బ్రేకర్లు అవసరం

**కరీంనగర్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



నగరపాలక సంస్థ పరిధిలోని 53వ డివిజన్‌లో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తక్షణమే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ కొంపెల్లి శ్వేత--రమణ్ వినతిపత్రం సమర్పించారు.గురువారం మేయర్, మున్సిపల్ కమిషనర్, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు వినతి అందజేసిన వారు, మంచిర్యాల చౌరస్తా మసీదు సమీపం, శర్మానగర్ జెండా చౌరస్తా, పోచమ్మ గుడి, గాంధీ విగ్రహం నుండి వీక్లీ మార్కెట్ లైన్ వరకు వాహనాలు అధిక వేగంతో ప్రయాణించడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా ఈ ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన స్పీడ్ బ్రేకర్ల నిర్మాణం చేపట్టాలని వారు అధికారులను కోరారు.ప్రజల రక్షణ కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ శ్వేత--రమణ్ విజ్ఞప్తి చేశారు.

## రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి

**- రంగారెడ్డి జిల్లా DCC అధ్యక్షులు**



**రంగారెడ్డి జిల్లా, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా డీసీసీ అధ్యక్షులు, టీయూఎఫ్ఐడీసీ ఛైర్మన్ చల్లా నరసింహ రెడ్డి మాట్లాడుతూ, "బడుగు బలహీన వర్గాల కోసం సేవలందించిన మహానీయుడు రాజీవ్ గాంధీ దేశ ప్రజల గుండెల్లో నిత్యం సంజీవుడే" అని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతీ ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ, "అట్టడుగు వర్గాల అభ్యున్నతికి రాజీవ్ గాంధీ చేసిన కృషి చిరస్మరణీయం" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిద్ధలా దశరథ్, మాజీ కార్పొరేటర్ సిద్ధలా శ్రీశైలం, మాజీ టెంపుల్ డైరెక్టర్ వెంకటేశ్వర్ గౌడ్, విజేందర్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బీ. రోహిత్ రెడ్డి, ఈ. సురేందర్ రెడ్డి, సీనియర్ నాయకురాలు గంగమ్మ, మాజీ మహిళా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ వై. అరుణ దేవి, మాజీ మహిళా అధ్యక్షురాలు కె. పద్మశ్రీ, సోషల్ మీడియా నాయకులు సిదేశ్వర్ చారి, ఆలే శ్రీనివాస్, శేఖర్ రెడ్డి, సుభాష్ రెడ్డి, మురళి గౌడ్, పరశురాం, సైదులు, ఓం ప్రకాష్, అలా శ్రీనివాస్ రెడ్డి, కె. సుధాకర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ఎస్‌పై దుష్ప్రచారం చేస్తే చర్యలు తప్పవు

**కరీంనగర్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రతిష్టకు భంగం కలిగించేలా అసత్య ప్రచారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత సంఘచాలక్ బర్ల సుందర్ రెడ్డి, ప్రచార ప్రముఖ్ కట్టా రాజగోపాల్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.బీజేపీ నాయకుడు బండి సంజయ్‌కు సంబంధించిన వ్యవహారాల్లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను, సంస్థను అనవసరంగా లాగుతూ కొన్ని మీడియా సంస్థలు బద్నాం చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యవాహ కాచం రమేష్, ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్‌కు బండి సంజయ్‌తో ఆర్థిక లావాదేవీలు ఉన్నాయంటూ వస్తున్న కథనాలు పూర్తిగా అసత్యమని, నిరాధారమని స్పష్టం చేశారు.బీజేపీ అంతర్గత వ్యవహారాలను ఆ పార్టీ కేంద్ర నాయకత్వమే పర్యవేక్షిస్తుందని, ఇందులో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర శాఖకు ఎలాంటి ప్రత్యక్ష జోక్యం లేదని వారు తేల్చి చెప్పారు. నిరాధారమైన తప్పుడు వార్తలను ప్రసారం చేయడం ఆపకపోతే చట్టప్రకారం న్యాయపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు స్పష్టం చేసిన ఈ హెచ్చరికతో మీడియా వర్గాల్లో చర్చ మొదలైంది.

# డంప్‌యార్డ్ సమస్యపై రౌండ్ టేబుల్ సమావేశం

**కరీంనగర్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: నగర ప్రజలు తీవ్రంగా ఎదుర్కొంటున్న డంప్‌యార్డ్ సమస్యపై చర్చించేందుకు సిపిఐ ఆధ్వర్యంలో రేపు ఉదయం 10 గంటలకు గణేష్‌నగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది.సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు తెలిపారు. డంప్‌యార్డ్ నుండి వచ్చే పొగ కారణంగా 10--15 డివిజన్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, శాశ్వత పరిష్కారం కోసం అన్ని రాజకీయ పార్టీలతో కలిసి కార్యాచరణ రూపొందించి పాలకవర్గంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్య రక్షణ కోసం డంప్‌యార్డ్ సమస్యపై రేపటి సమావేశం కీలకంగా నిలవనుంది.

# కారాగారంలో న్యాయ సహాయ కేంద్రం ప్రారంభం

**కరీంనగర్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



: తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా కారాగారంలో ఖైదీలను కలవడానికి వచ్చే సందర్శకులకు న్యాయ సహాయం అందించేందుకు ప్రత్యేక న్యాయ సహాయ కేంద్రం ప్రారంభమైంది.జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే. రాణి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ, "ఖైదీలకే కాకుండా వారిని కలవడానికి వచ్చే సందర్శకులకు కూడా న్యాయ సలహా, సహాయం అందించడంలో జిల్లా న్యాయ సేవా సంస్థ ముందుంటుంది అని తెలిపారు.డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్ సందర్శకులకు న్యాయ సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో జైలర్ శ్రీనివాస్, రమేష్, డిప్యూటీ జైలర్ సుధాకర్ రెడ్డి, కారాగార సిబ్బంది పాల్గొన్నారు.ఖైదీలతో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా న్యాయ సహాయం అందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడనుంది.

## అక్రమంగా నడుపుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్



**కరీంనగర్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, అనుమతి లేని పాఠశాలలను వెంటనే మూసివేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డీఈవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించింది. అనంతరం ఏడి మాధవికి వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ, అనుమతి లేకుండా పాఠశాలలు ప్రారంభమవడం ఆందోళనకరమని, విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై భారీ ఫీజుల భారం మోపుతున్నారని విమర్శించారు. ఒక పాఠశాలకు ఉన్న అనుమతిని ఆధారంగా చేసుకుని అదే పేరుతో అనేక బ్రాంచీలు నడపడం, కరికులం, ఒలింపియాడ్, వరల్డ్, ఎక్స్‌ప్లోర్, యూనివర్సల్ వంటి తోకపేర్లను నిబంధనలకు విరుద్ధంగా ఉపయోగించడం జరుగుతోందని తెలిపారు.ప్రభుత్వం చొరవ తీసుకుని అక్రమ పాఠశాలలను పర్యవేక్షించి మూసివేయాలని, విద్యా ప్రమాణాలు పాటించని సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వినయ్, సహాయ కార్యదర్శి బొగేశ్వర్, కమిటీ సభ్యులు రోహిత్, సందేశ్, సన్నీ, రాకేష్, మానస, నాయకులు మనోజ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం అక్రమ విద్యాసంస్థలను మూసివేయాలని ఎస్ఎఫ్ఐ స్పష్టం చేసింది.

## రాఘవాచారి మృతికి సంతాపం వ్యక్తం చేసిన నారోజు కుమారస్వామి



**మర్రిగూడ, మే21( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మర్రిగూడ మండల విశ్వకర్మ సంఘం మాజీ కోశాధికారి, స్థానిక నివాసి సలివోజు రాఘవాచారి అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు, శ్రీ శ్రీ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారోజు కుమారస్వామి చారి గురువారం మర్రిగూడకు చేరుకుని, రాఘవాచారి భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాఘవాచారి మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. విశ్వకర్మ సంఘానికి ఆయన అందించిన సేవలు ఎనలేనివని, నిరంతరం సంఘం బలోపేతానికి కృషి చేశారని కొనియాడారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాఘవాచారికి నివాళులర్పించిన వారిలో కుమారస్వామి చారితో పాటు సలివోజు శ్రీనివాస చారి, యాదయ్య చారి, లెంకలపల్లి పరిపూర్ణాచారి, సేగోజు నర్సింహాచారి, గుంటోజు శ్రీనివాసచారి, నారోజు శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు




**కరీంనగర్ రూరల్ , మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
6వ డివిజన్ బొమ్మకల్‌లో బీరప్ప కమరావతి కళ్యాణోత్సవాల కార్యక్రమంలో భాగంగా గ్రామ దేవత పోచమ్మ తల్లికి కురుమ సంఘం ఆధ్వర్యంలో బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల వెంకటేష్, పెద్ద కురుమలు మేకల చిన్న కనుకయ్య, దయ్యాల పోచాలు, మేకల బీరయ్య, పెద్ది నర్సయ్య, బాగోతం బీరయ్య, పెద్ది కనుకయ్యతో పాటు కుల సంఘం సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ దేవతకు సమర్పించిన బోనాలు భక్తి, ఐక్యత వాతావరణాన్ని సృష్టించాయి.

## ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు





**కరీంనగర్/సిద్దిపేట, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ 35వ మరియు 36వ వర్ధంతి వేడుకలు తెలంగాణలో ఘనంగా నిర్వహించబడ్డాయి. హైదరాబాద్ గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధి, సాంకేతిక రంగ పురోగతి, యువత సాధికారత కోసం రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. శాస్త్ర సాంకేతిక రంగంలో తీసుకున్న నిర్ణయాలు భారతదేశానికి బలమైన పునాదులు వేశాయని, ఆయన ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ రూరల్ మండలంలోని వి బి ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి మిడిదొడ్డి కపిల్ మాధవ ఆధ్వర్యంలో అన్నవితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిటీ అధ్యక్షుడు అంజన్ కుమార్, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలో సామాజిక కార్యకర్త, కంటస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ సమాచార విప్లవ పితామహుడు, ఆధునిక భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మహానేత అని పేర్కొన్నారు. కంప్యూటర్ విప్లవం, టెలికమ్యూనికేషన్ అభివృద్ధి, పంచాయతీరాజ్ బలోపేతం వంటి సంస్కరణలతో దేశాన్ని ఆధునిక యుగంలోకి తీసుకెళ్లారని అన్నారు. యువత శక్తిపై విశ్వాసం ఉంచి 18 ఏళ్ల వారికి ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్యంలో కొత్త దారులు తెరిచారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సామాజిక సంఘాల ప్రతినిధులు పాల్గొని రాజీవ్ గాంధీ ఆశయాలను స్మరించారు. దేశాన్ని ఆధునికత వైపు నడిపించిన మహానేత రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని వర్ధంతి సభల్లో స్పష్టం చేశారు.

## కార్పొరేషన్‌కు యూసీఎఫ్ నిధుల వరద

**కరీంనగర్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) కింద రూ.840 కోట్ల విలువైన పనులకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ కార్యదర్శి హీరాలాల్ మిశ్రా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపారు. ఈ నిధులతో మోడల్ రోడ్లు, స్కైవాక్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, జంక్షన్ల అభివృద్ధికి రూ.630 కోట్లు, డ్రెయిన్ల పునరుద్ధరణ--వరద నివారణ చర్యలకు రూ.130 కోట్లు, ఘన వ్యర్థాల నిర్వహణకు రూ.80 కోట్లు కేటాయించారు. ఈ నిధులు సద్వినియోగం అయితే కరీంనగర్ రూపురేఖలు మారిపోతాయని అధికారులు పేర్కొన్నారు. తొలుత యూసీఎఫ్ జాబితాలో కరీంనగర్ లేకపోయినా, కేంద్ర మంత్రి బండి సంజయ్ పట్టుదలతో ప్రతిపాదనలు ఆమోదం పొందాయి. వరంగల్ కార్పొరేషన్ ప్రతిపాదనలతో పాటు ఖమ్మం--వరంగల్--కరీంనగర్ కారిడార్‌ను చేర్చిన తర్వాత, కరీంనగర్ ప్రతిపాదనలను కూడా కేంద్రానికి పంపించారు. ఈ అంశంపై బండి సంజయ్ ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్‌ను పలుమార్లు కలసి ఒప్పించారు. చివరికి అపెక్స్ కమిటీ ఆమోదం తెలిపింది. నిధుల మంజూరుపై మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ కార్పొరేటర్లు హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, ముఖ్యంగా బండి సంజయ్ కృషి వల్లే కరీంనగర్ కార్పొరేషన్‌కు ఇంత పెద్ద ఎత్తున నిధులు లభించాయని వారు ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్ తరువాత ఆధునిక సౌకర్యాలు కరీంనగర్‌లో అందుబాటులోకి రానున్నాయి.

## పెన్షన్ పేరుతో వృద్ధురాలిని మోసం



**హుస్నాబాద్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెన్షన్ ఇప్పిస్తానని నమ్మించి ఓ వృద్ధురాలిని మోసం చేసి ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల పుస్తెలతాడును ఎత్తుకెళ్లిన ఘటన హుస్నాబాద్ పట్టణంలో కలకలం రేపింది. గాయత్రి బ్యాంక్ ఎదుట కూర్చున్న ఐలేని లక్ష్మిని ఓ వ్యక్తి పలకరించి రూ.4 వేల పెన్షన్ ఇప్పిస్తానని మాయమాటలు చెప్పాడు. అనంతరం ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడును తీసుకుని పరారయ్యాడు. విషయం తెలిసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వృద్ధురాలిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలిస్తూ నిందితుడిని గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు అపరిచితుల మాటలు నమ్మి మోసపోవద్దని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. పెన్షన్ పేరుతో మోసం చేసిన ఘటన స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది.

## ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు చేపట్టాలని బీజేపీ నేతలు వినతి

**జగిత్యాల, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రంలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న తీవ్ర జాప్యం, మౌలిక వసతుల లేమి, తరుగు, తేమ పేరుతో జరుగుతున్న దోపిడిని అరికట్టాలని, యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ జగిత్యాల పట్టణ శాఖ స్థానిక ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్ మాట్లాడుతూ, రైతులు చెమటోడ్చి పండించిన పంటను అమ్ముకోవడానికి వారాలు తరబడి కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరుగుతూ నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం, ముందస్తు ప్రణాళిక లోపం కారణంగా అన్నదాతలు రోడ్డుపై కూర్చునే పరిస్థితి ఏర్పడిందని



విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో తక్షణమే కాంటాలు, గన్ని బ్యాగులు, హమాలీలు, లారీలను అందుబాటులోకి తెచ్చి ప్రతి గింజను వెంటనే కొనుగోలు చేయాలని, తరుగు, తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టే దళారులపై, అవకతవకలకు పాల్పడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నెలరోజులు గడిచినా ధాన్యం కొనుగోలు జరగకపోవడం దురదృష్టకరమని, ఇకనైనా ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముదరాజు, ఉపాధ్యక్షులు ఇట్యాల రాము, గాదాసు రాజేందర్, ఠాగూర్ పవన్ సింగ్, కొప్పు భాస్కర్, కార్యదర్శి మేడిపల్లి పుష్పరెడ్డి, మహిళా మోర్చా సభ్యులు పిండేరు భానుప్రియ, మధురిమ, నాయకులు నారపాక అశోక్, కాసారాపు శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి పూదరి శ్రీనివాస్, దామోదర్, గోస్కుల గంగాధర్, తరాల మహేష్, సంఘ తిరుపతి, చేని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.
రైతుల సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ శాఖ స్పష్టం చేసింది.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

### - కలెక్టర్ కె. హైమావతి

**సిద్దిపేట, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కలెక్టర్ కె. హైమావతి గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు, ఏంజీఎన్ఆర్ఈజీఎస్, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, ఘన వ్యర్థాల నిర్వహణ--2026 అంశాలపై సమీక్ష జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ముఖ్యమంత్రి చేతుల మీదుగా సామూహిక గృహప్రవేశాలు జరగనున్నందున, అప్పటికి అన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రస్తుతం స్లాబ్ స్థాయిలో ఉన్న గృహాలను పూర్తిస్థాయిలో నిర్మించి సిద్ధం చేయాలని సూచించారు. మార్కింగ్ చేసుకుని పనులు ప్రారంభించని లబ్ధిదారులతో సమావేశమై వెంటనే పనులు ప్రారంభించేలా చూడాలని, ఈ నెల 30లోపు పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పనులు ప్రారంభించకపోతే వాటిని డిలీట్ చేయాలని హెచ్చరించారు. ఏంజీఎన్ఆర్ఈజీఎస్ కింద



గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీలు, పాఠశాల కాంపౌండ్ వాల్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీఓ భవనాలు, ఫుడ్ గ్రైన్ స్టోరేజ్ బిల్డింగ్స్, ఫెడరేషన్ భవనాల పనులు వేగవంతం చేయాలని సూచించారు. కాంట్రాక్టర్లు ముందుకు రాని చోట కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లతో సమావేశాలు నిర్వహించి పనులు ప్రారంభించేలా చూడాలని ఆదేశించారు. రోజువారీగా చేసిన పనులకు ఎఫ్‌టీఓలు జనరేట్ చేయాలని, జూన్ 15లోపు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లలో మేజర్, మైనర్ రిపేర్లను కూడా పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద రోజుకు 53 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, ఈ సంఖ్యను మరింత పెంచాలని, ప్రతి గ్రామానికి టార్గెట్ నిర్ణయించి అధికారులు ఉదయం 7 గంటలకు పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ ఏడాది వనమహోత్సవం కింద జిల్లాకు 15 లక్షల మొక్కల లక్ష్యం కేటాయించారని, నర్సరీల నిర్వహణపై దృష్టి పెట్టాలని, ఎస్‌హెచ్‌జీ మహిళలతో సమావేశాలు నిర్వహించి ముందుగానే స్థలాలను గుర్తించాలని సూచించారు. రోడ్ల వెంబడి కాకుండా ఎక్కువకాలం నిలిచే ప్రదేశాల్లో మొక్కలు నాటాలని ఆదేశించారు. చేయూత పెన్షన్ ఫేస్ రికగ్నిషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, మరణ ధృవీకరణ పత్రం తప్పనిసరిగా జత చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను సర్పంచ్ జనరల్ బాడీ తీర్మానాల ప్రకారం వినియోగించాలని, పంచాయతీరాజ్ కమిషనర్ మార్గదర్శకాల మేరకు గ్రామాల్లో కార్యక్రమాలను పగడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓలకు సూచించారు. జూన్ 2లోపు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని కలెక్టర్ హైమావతి స్పష్టం చేశారు.

## రైతుల సమస్యలపై కలెక్టర్ కార్యాలయంలో బీజేపీ నేతలు వినతి



**పెద్దపల్లి, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలో వడ్ల, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కొనుగోలు కేంద్రాల్లో ఉద్దేశపూర్వక ఆలస్యం, గ్రేడ్‌ల వారీగా తూకాల్లో అవకతవకలు, కనీస సదుపాయాల లేమి, చెల్లింపుల్లో జాప్యం వంటి సమస్యల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. మధ్యవర్తుల జోక్యం పెరిగి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని కూడా ఆరోపించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అమరగాని ప్రదీప్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్ల మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం అనర్థాలకు దారి తీస్తోందని విమర్శించారు. వెంటనే పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ నిర్వహించి, రైతులకు తక్షణ చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం, ఉపాధ్యక్షులు కాసగోని నిర్మల, బెజ్జంకి దిలీప్ కుమార్, మెరుగు కనకయ్య, సాయికృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. రైతుల ఇబ్బందులు తొలగించకపోతే ఆందోళనలు తప్పవని బీజేపీ నేతలు స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్యాయం జరుగుతుందని బీజేపీ విమర్శలు



**కరీంనగర్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మొక్కజొన్న రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపుతో వ్యవహరిస్తోందని, కనీస మద్దతు ధర రూ.2400 ఉండగా అధికారులు, ట్రేడర్లతో కుమ్మక్కై రూ.1600--1800కే కొనుగోలు చేసి రైతాంగాన్ని నిలువునా దోచుకుంటున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తీవ్రంగా విమర్శించారు. గురువారం జమ్మికుంట మార్కెట్ యార్డ్‌లో మక్క కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, 20 రోజులు గడిచినా ప్రభుత్వం కొనుగోలు ప్రారంభించకపోవడం రైతులను నరకయాతనకు గురిచేస్తోందని అన్నారు. గన్నీ బ్యాగులు, వాహనాలు, కూలీలను కూడా అందుబాటులోకి తేవడంలో ప్రభుత్వం విఫలమైందని, ఇది రైతుల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. దళారులు, ట్రేడర్లు కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్న వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, యార్డులో ఉన్న మక్కలను వెంటనే ఎంఎస్పీ ధర చెల్లించి కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రమేష్ యాదవ్, పట్టణాధ్యక్షుడు కొలకాని రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పుప్పాల రఘు, మాజీ జిల్లా కార్యదర్శి కనుమల్ల గణపతి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్ రావు, మాజీ మండలాధ్యక్షుడు సంపెల్లి సంపత్ రావు, సర్పంచి పుప్పాల రాజారం, శీలం శ్రీనివాస్, రాజేష్ ఠాగూర్, టంగుటూరి రాజ్ కుమార్, ఆవుల తిరుపతి, జీడి మల్లేష్, మెరుగు శ్రీనివాస్, తూర్పాటి శంకర్, కైలాసకోటి గణేష్, రాచేపల్లి ప్రశాంత్, అఖిల్, కొమ్ము అశోక్, ఆడవాళ్ళ శ్రీధర్, ఆకుల పోశయ్య, తిరుపతి, కొండ్ల నగేష్, సమ్మిరెడ్డి, గట్టు వీరన్న, చంద్రమౌళి, వెంగళరావు తదితరులు పాల్గొన్నారు. రైతులకు న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బీజేపీ నేతలు హెచ్చరించారు.

# బిజినెస్

## నష్టాల్లో ముగిసిన భారతీయ స్టాక్ మార్కెట్..

**- సెన్సెక్స్ 135, నిఫ్టీ 5 పాయింట్లు పతనం**



భారతీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 135.03 పాయింట్లు నష్టపోయి, 75,183.36 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా స్వల్పంగా.. అంటే 4.30 పాయింట్లు నష్టపోయి 23,789 పాయింట్ల వద్ద ముగిసింది. ఉదయం ట్రేడింగ్ లాభాల్లోనే కొనసాగింది. సెన్సెక్స్ ఒకదశలో 500 పాయింట్లు పెరిగింది. ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్ చివరికి నష్టాల్లో ముగిసింది. క్రూడాయిల్ ధరలు తగ్గడం, ఇరాన్‌తో చర్చలు జరుగుతాయని ట్రంప్ ప్రకటిండచడం ఉదయం మార్కెట్‌కు కలిసొచ్చింది. ఆర్బీఐ రేట్లు పెంచుతుందనే భయం, ద్రవ్యోల్బణం పెరుగుదల, అంతర్జాతీయ పరిణామాలు వంటివి మార్కెట్ నష్టాలకు కారణాలు. ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లపై ఒత్తిడి పెరగడంతో మార్కెట్ ప్రభావితమైంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, హిందుస్తాన్ యునీలీవర్ షేర్లు నష్టపోయాయి. అల్ట్రాటెక్, ఇండిగో, అదానీ పోర్ట్స్, ట్రెంట్, బీఈఎల్ షేర్లు లాభాలు చవిచూశాయి. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.63 శాతం పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధర స్వల్పంగా తగ్గింది. బ్యారెల్ క్రూడాయిల్ ధర 104 డాలర్ల వద్ద కొనసాగింది. బంగారం ఔన్స్ ధర 4518 డాలర్ల వద్ద కొనసాగింది. మరోవైపు గురువారం రూపాయి స్వల్పంగా లాభపడింది. డాలర్‌తో రూపాయి 63 పైసలు బలపడి 96.23కు చేరింది.

## మళ్లీ పెరిగిన పసిడి ధరలు..

**రూ.1,60,000కు చేరువలో 24 క్యారెట్ల బంగారం**

**హైదరాబాద్,**
దేశీయ మార్కెట్లో బంగారం ధరలు మరోసారి పుంజుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న ఒడిదొడుకులు, స్థానిక నగల వ్యాపారుల నుంచి డిమాండ్ పెరగడంతో గురువారం బులియన్ మార్కెట్లో పసిడి ధరలు భారీగా పెరిగాయి. హైదరాబాద్, విజయవాడ సహా తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ఈరోజు పసిడి రేట్లు ఏ విధంగా ఉన్నాయో ఒకసారి చూద్దాం.తెలుగు రాష్ట్రాల్లో నేటి ధరల వివరాలు:24 క్యారెట్ల బంగారం (ప్యూర్ గోల్డ్): నిన్నటి ధరపై రూ. 490 మేర పెరిగి, ప్రస్తుతం 10 గ్రాముల ధర రూ. 1,59,930 వద్ద కొనసాగుతోంది. 22 క్యారెట్ల బంగారం (ఆర్నమెంట్ గోల్డ్): తులానికి (10 గ్రాములు) రూ. 450 పెరిగి, ప్రస్తుతం రూ.



1,46,600 వద్ద విక్రయించబడుతోంది. వెండి ధర: పసిడి బాటలోనే వెండి కూడా పరుగులు పెడుతోంది. మార్కెట్లో కిలో వెండి ధర గరిష్టంగా రూ. 2,90,000 మార్కుకు చేరింది. ధరల పెరుగుదలకు కారణాలు:అంతర్జాతీయంగా ముడిచమురు ధరల హెచ్చుతగ్గులు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై వస్తున్న అంచనాలు ప్రపంచవ్యాప్తంగా పసిడి మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయి. దీనికి తోడు మనదేశంలో పెళ్లిళ్ల సీజన్ కావడంతో కొనుగోళ్లు పెరిగి ధరలు మళ్లీ శరవేగంగా రూ.1.60 లక్షల దిశగా దూసుకుపోతున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.(గమనిక: ఇక్కడ పేర్కొన్న ధరలు ఉదయం మార్కెట్ ప్రారంభ సమయానికి సంబంధించినవి. స్థానిక పన్నులు, జీఎస్టీ మరియు మేకింగ్ ఛార్జీల ఆధారంగా షోరూముల్లో ధరల్లో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉంది.)


## టీనేజర్లకు పేటీఎం బంపర్ ఆఫర్.. కొత్త ఫీచర్ వైరల్

డిజిటల్ చెల్లింపుల దిగ్గజం పేటీఎం టీనేజర్లను లక్ష్యంగా చేసుకుని సరికొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. 'పేటీఎం పాకెట్ మనీ' పేరుతో ప్రారంభించిన ఈ సరికొత్త ఫీచర్ ద్వారా బ్యాంకు ఖాతా లేని టీనేజర్లు సైతం ఇకపై నేరుగా యూపీఐ చెల్లింపులు చేసుకోవచ్చు. నగదు అవసరాల కోసం లేదా చిన్న చిన్న పేమెంట్స్ కోసం ప్రతిసారీ తల్లిదండ్రులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా ఈ ఫీచర్ తోడ్పడుతుందని కంపెనీ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రకటనలో తెలిపింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రవేశపెట్టిన 'యూపీఐ సర్కిల్' ఆధారంగా ఈ సేవలు పనిచేస్తాయి. దీని ద్వారా బ్యాంకు ఖాతా ఉన్న ప్రాథమిక యూజర్ అంటే తల్లి లేదా తండ్రి, తమ పిల్లలను సెకండరీ యూజర్‌గా చేర్చుకోవచ్చు. దీనివల్ల ఒకే అకౌంట్‌తో పిల్లలు కూడా తమ సొంత ఫోన్ల ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పేమెంట్స్ చేయవచ్చు. ప్రతిసారీ తల్లిదండ్రుల ఫోన్ తీసుకోవడం, ఓటీపీల కోసం వేచి చూడటం లేదా క్యూఆర్ కోడ్‌ను వాట్సాప్‌లో పంపడం వంటి ఇబ్బందులు దీనితో తప్పుతాయి. పిల్లలు దుబారా ఖర్చులు చేయకుండా ఉండేందుకు తల్లిదండ్రులు పూర్తి నియంత్రణ కలిగి ఉండవచ్చు. ఈ ఫీచర్ ద్వారా ప్రతి లావాదేవీకి గరిష్ఠంగా రూ. 5,000, నెలవారీ మొత్తం ఖర్చుకు రూ. 15,000 వరకు పరిమితి విధించారు. భద్రతా కారణాల దృష్ట్యా, ఫీచర్ సెటప్ చేసిన మొదటి 30 నిమిషాల్లో రూ. 500, మొదటి 24 గంటల్లో రూ. 5,000 వరకు మాత్రమే విక్రయాలు జరపడానికి వీలవుతుంది. 'పేటీఎం స్పెండ్ సమ్మరీ' ద్వారా పిల్లల ఖర్చులను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించవచ్చు. అవసరమైతే యాక్సెస్‌ను తక్షణమే రద్దు చేసే అధికారం కూడా వారికి ఉంటుంది. పాఠశాల, కాలేజీ క్యాంటీన్లు, మెట్రో, షాపింగ్ వంటి రోజువారీ అవసరాలకు ఈ ఫీచర్ ఎంతగానో ఉపయోగపడనుంది.

# స్పోర్ట్స్

## జాన్వీతో కలిసి సరదాగా ప్యాట్ కమిన్స్


క్రికెట్, సినిమా.. ఈ రెండు రంగాలకు ఇండియాలో ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తాజాగా ఈ రెండు రంగాలకు చెందిన ఇద్దరు స్టార్స్ ఒకే వేదికపై సందడి చేశారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హైదరాబాద్‌లో జరిగిన ఓ ఫ్యాన్ ఈవెంట్‌లో కలుసుకున్నారు. ఎప్పుడూ మైదానంలో తన ఫాస్ట్ బౌలింగ్‌తో బ్యాటర్లను భయపెట్టే కమిన్స్.. ఇక్కడ మాత్రం తన సీరియస్‌నెస్‌ను పక్కనపెట్టి జాన్వీతో కలిసి సరదాగా క్రికెట్ ఆడుతూ ఫ్యాన్స్‌ను ఫుల్ ఎంటర్‌టైన్ చేశాడు. హైదరాబాద్‌లో ఈవెంట్‌లో ఓ ఆసక్తికర ఘట్టం చోటు చేసుకుంది. ఫ్యాన్స్‌తో ఇంటరాక్ట్ అయ్యేందుకు స్టేజ్‌పై ఏర్పాటు చేసిన చిన్న క్రికెట్ సెటప్‌లో 'పెద్ది' మూవీ స్టార్ జాన్వీ కపూర్ బ్యాట్ పట్టుకోగా, కమిన్స్ బౌలింగ్ చేశాడు. ఆస్ట్రేలియా స్పీడ్‌స్టర్ సరదాగా వేసిన బంతిని జాన్వీ కాస్త ముందుకు వచ్చి బలంగా షాట్ ఆడింది. అయితే ఎవరూ ఊహించని విధంగా ఆ బంతి నేరుగా వెళ్లి అక్కడే ఉన్న ప్రేక్షకుల్లోకి దూసుకెళ్లింది. సరిగ్గా అదే సమయంలో స్టేజ్ కింద ఓ అభిమాని తన మొబైల్‌లో ఈ ఫన్నీ దృశ్యాలను రికార్డ్ చేస్తున్నాడు. జాన్వీ కొట్టిన బంతి నేరుగా వెళ్లి ఆ ఫ్యాన్ ఫోన్‌కి తగలడంతో ఒక్కసారిగా అంతా షాక్ అయ్యారు. ఈ అనుకోని సంఘటనతో స్టేజ్ మీద ఉన్న జాన్వీ కూడా కంగుతింది. ఆ తర్వాత క్షణాల్లోనే అక్కడి వాతావరణం అంతా నవ్వులు, కేకలతో నిండిపోయింది. ఈ



యాక్సిడెంటల్ షాట్, ఆ వెంటనే జాన్వీ ఇచ్చిన రియాక్షన్‌కు సంబంధించిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారాయి. ఈ క్యూట్ అండ్ షాకింగ్ ఇన్సిడెంట్ తర్వాత జాన్వీ కపూర్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించింది. బంతి తగిలిన అభిమానికి క్షమాపణలు చెబుతూ ఓ పోస్ట్ పెట్టింది. "నేను కొట్టిన బంతి ఎవరి కంటికైతే తగిలిందో వాళ్ళకి సారీ.. క్రికెట్ ఆడేటప్పుడు నా బ్యాలెన్స్ ఇంకా పూర్తిగా సెట్ కాలేదు, కానీ ఎప్పటికీ నేను చఅవష్మెుశ్రీ-ఖఅఎవ బేబీనే" అంటూ సరదాగా రాసుకొచ్చింది. ఈ పోస్ట్ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. గతంలో 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' సినిమా కోసం సుమారు 150 రోజుల పాటు కఠినమైన క్రికెట్ శిక్షణ తీసుకుంది జాన్వీ కపూర్. అందుకే ఈమెకు క్రికెట్‌లో మంచి టాలెంట్ ఉ:ది. కోచ్ అభిషేక్ నాయర్ పర్యవేక్షణలో ప్రొఫెషనల్ క్రికెటర్‌లా బ్యాటింగ్, బౌలింగ్ నైపుణ్యాలు నేర్చుకుంది ఈ బ్యూటీ. ఈ ప్రాక్టీస్ సమయంలో జాన్వీకీ చాలా దెబ్బలు కూడా తగిలాయి. ఆ ప్రాక్టీస్ ఇప్పుడిలా పనికొచ్చింది. కమిన్స్, జాన్వీ కలిసిన ఈ అరుదైన క్రికెట్-సినిమా క్రాస్‌ఓవర్ మూమెంట్ ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. సినిమా వాళ్లను చూడటానికి వచ్చిన అభిమానులకు స్టార్ క్రికెటర్ కూడా తోడవడంతో ఈవెంట్‌కు విపరీతమైన క్రేజ్ వచ్చింది. జాన్వీ ఆడిన పవర్‌ఫుల్ షాట్‌పై, పాపం వీడియో తీసుకుంటూ బంతి బారిన పడ్డ ఆ అభిమానిపై నెటిజన్లు రకరకాల మీమ్స్, జోక్స్ క్రియేట్ చేస్తున్నారు. ఏదేమైనా.. రీసెంట్ టైమ్స్‌లో జరిగిన అత్యంత ఫన్నీ అండ్ ఎంటర్‌టైనింగ్ సెలబ్రిటీ ఈవెంట్‌గా ఇది నిలిచిపోయింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. పెద్ది సినిమాలో కూడా క్రికెట్ నేపథ్యం ఉంది. మే 22న ఉప్పల్ స్టేడియంలో జరగబోయే మ్యాచ్‌లో పెద్ది సినిమా ప్రమోషనల్ యాక్టివిటీ కూడా ఉంది.

## ఐపీఎల్ రికార్డులను బద్దలు కొట్టిన వైభవ్ సూర్యవంశీ

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ లో రాజస్థాన్ రాయల్స్ టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ తన రికార్డుల పరంపరను కొనసాగిస్తున్నాడు. జైపూర్‌లో లక్నో సూపర్ జెయింట్స్ విధించిన 221 పరుగుల భారీ టార్గెట్‌ను ఛేదించే క్రమంలో సూర్యవంశీ కేవలం 38 బంతుల్లోనే 93 పరుగులతో విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలోనే ఒక ఐపీఎల్ సీజన్ లో 500 పరుగుల మార్కును అందుకున్న అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. ఇంతకుముందు 2018 లో ఢిల్లీ డెర్‌డెవిల్స్ తరపున 20 ఏళ్ల వయసులో ఈ ఘనత సాధించిన రిషభ్ పంత్ రికార్డును ఈ యువ ఆటగాడు అధిగమించాడు. ప్రస్తుత ఎడిషన్‌లో కనీసం 500 కంటే ఎక్కువ పరుగులు చేసిన బ్యాటర్లలో 236.3 అత్యధిక స్ట్రైక్ రేట్‌తో సూర్యవంశీ మొదటి స్థానంలో నిలిచాడు. ఈ ఇన్నింగ్స్ ద్వారా ఒకే ఐపీఎల్ సీజన్ లో 50 సిక్సర్లు బాదిన మొట్టమొదటి భారతీయ బ్యాటర్‌గా వైభవ్ సూర్యవంశీ సరికొత్త చరిత్ర సృష్టించాడు.



ప్రస్తుతం ఈ 2026 సీజన్ లో ఆయన ఖాతాలో మొత్తం 53 సిక్సర్లు ఉన్నాయి. ఒకే ఇన్నింగ్స్‌లో 10 లేదా అంతకంటే ఎక్కువ సిక్సర్లు రెండుసార్లు కొట్టిన రేర్ రికార్డును కూడా ఆయన దక్కించుకున్నాడు. తాజా డేటా ప్రకారం, పవర్‌ప్లేలో అత్యధిక సిక్సర్లు (60 సిక్సర్లు) కొట్టిన జట్టుగా రాజస్థాన్ రాయల్స్ సరికొత్త ఐపీఎల్ రికార్డు నెలకొల్పింది. ఇందులో సూర్యవంశీ ఒక్కడే 37 సిక్సర్లు బాదగా, యశస్వి జైస్వాల్ 12, మిగిలిన టీమ్ సభ్యులు 11 సిక్సర్లు కాంట్రిబ్యూట్ చేశారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్ జట్టుకు వైభవ్ సూర్యవంశీ (93 పరుగులు, 10 సిక్సర్లు, 7 ఫోర్లు) బ్లిస్టరింగ్ స్టార్ట్ ఇచ్చాడు. ఆయనతో పాటు ధ్రువ్ జురెల్ కూడా 38 బంతుల్లో 53 పరుగులతో రాణించడంతో రాయల్స్ జట్టు కేవలం 3 వికెట్లు కోల్పోయి సులువుగా విజయాన్ని అందుకుంది. ఈ అద్భుత విజయంతో రాజస్థాన్ రాయల్స్ టీమ్ 14 పాయింట్లతో ఐపీఎల్ పాయింట్ల పట్టికలో నాలుగో స్థానానికి దూసుకెళ్లింది.

## పాండ్యాకు మ్యాచ్ ఫీజులో భారీ కోత..

**ఒక డీమెరిట్ పాయింట్..!**



ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో నాయకుడిగా, ఆటగాడిగా దారుణంగా విఫలమైన హార్దిక్ పాండ్యా కు జరిమానా పడింది. ఐపీఎల్ నియమావళిని ఉల్లఘించినందుకు అతడు మ్యాచ్ ఫీజులో 10 శాతం కోల్పోనున్నాడు. మ్యాచ్ సమయంలో క్రికెట్ వస్తువులు(బ్యాట్, బంతి, వికెట్లు, గ్లోవ్స్, బెయిల్స్) పట్ల దురుసుగా ప్రవర్తించినందుకు అతడికి రిఫరీ రాజీవ్ సేథ్ జరిమానా విధించాడు. అసలేం జరిగిందంటే.. ఈడెన్ గార్డెన్స్‌లో బుధవారం కోల్‌కతా నైట్ రైడర్స్, ముంబై ఇండియన్స్ ఢీకొన్నాయి. కోల్‌కతా ఇన్నింగ్స్ సమయంలో 10వ ఓవర్ వేసిన పాండ్యా.. నాలుగో బతికి రనప్ కోసం నడుచుకుంటూ వెళ్తూ చేతితో బెయిల్స్‌ను నెట్టేస్తున్నట్టు బలంగా తాకాడు. దాంతో, అవి కిందపడిపోయాడు. అతడి చర్యను తీవ్రంగా పరిగణించిన పాండ్యాను విచారణకు పలిచాడు రిఫరీ రాజీవ్ సేథ్. ఐపీఎల్ నియమావళిలోని ఆర్టికల్ 2.2ను పాండ్యా ఉల్లంఘించాడని రిఫరీ తెలుపగా.. తాను నేరం చేశానని ముంబై కెప్టెన్ అంగీకరించాడు. దాంతో, రిఫరీ అతడికి మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించాడు. ఒక డీమెరిట్ పాయింట్ కూడా కేటాయించాడు. కోల్‌కతా చేతిలో ఘోర ఓటమి అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీజన్ ఆసాంతం పేలవ ఫీల్డింగ్ తమ కొంపముంచిందని పాండ్యా తెలిపాడు.

**రాజస్థాన్ రాయల్స్‌తో**
ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ 19వ సీజన్‌లో అనూహ్య తడబాటుతో ప్లే ఆఫ్స్ నుంచి నిష్క్రమించింది. లీగ్ దశను హ్యాట్రిక్ విజయాలతో ముగిద్దామనుకుంటే కోల్‌కతా నైట్ రెడర్స్ ముంబైని దెబ్బకొట్టింది. ఈడెన్ గార్డెన్స్‌లో హార్దిక్ పాండ్యా బృందాన్ని 147కే నిలువరించిన కేకేఆర్ స్వల్ప లక్ష్యాన్ని 18.5 ఓవర్లలోనే ఛేదించి నాకౌట్ అవకాశాల్ని మెరుగుపరచుకుంది. చివరి లీగ్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో మే 24న ముంబై తలపడనుంది.